# నవరాత్రి

## శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

### వివరణ

## వంశీకృష్ణ ఘనపాఠీ


## అవధూత దత్తపీఠమ్

**శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము**

**మైసూరు 570025**

# **నవరాత్రి**

**(శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీవారి దేవీ శరన్నవరాత్రి పూజా పరిచయము)**

**నవరాత్రి**, 2008

**ప్రతులు** 2000

# మనవి

## వంశీకృష్ణ ఘనపాఠీ

## త్వదీయాభి ర్వాగ్భిస్తవ జనని వాచాంస్తుతిరియమ్

ఈ నవరాత్రి కీర్తనలు అవధూత దత్తపీఠాధిపతి జగద్గురు పరమపూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారి దేవీ శరన్నవరాత్రి పూజావిధానమును మనకు విశదీకరించే అద్భుత స్మరణికలు, దశాబ్దాలుగా సద్గురుదేవులు అచరించే బహిరంగ పూజావిధానాలనూ, వాటివెనుక దాగిన అంతరంగభావనా రహస్యాంచలాలను మనకు చూపే అనర్ఘరత్నాలు.

విరాడ్రూపిణిగా, అన్తర్వర్తినిగా, విశ్వవ్యాప్తిగా, పరాశక్తిగా జగన్మాతను భావిస్తూ, తల్లీనతాధన్యతను అందజేసి సంతారికలు. గురురూపిణిగా శ్రీమాత అనుగ్రహించిన అత్మీయ పూజావిధి విశేషాలను భావిస్తూ, దర్శిస్తూ, అనుభవిస్తూ, తరిద్దాం. తమ ఉపదేశాలు, అరాధనలు, ప్రవచనాలు, సంకీర్తనలు మరియు చూదనలద్వారా ఇటువంటి అవగాహనను కల్పించి అనుగ్రహించిన సద్గురుదేవుల అవ్యాజకరుణాపారాపూర మహాశయానికి వందనాలు.

మా అపరాధాలను క్షమించి,

అజ్ఞానమును పారదోలే జ్ఞానదీపమా

ఏమౌను నా చేత, ఇది నీకు జోత.

అవ్యాజకరుణామూర్తి రజ్ఞానధ్వాంత దీపికా

**జయగురుదత్త శ్రీమాత్రే నమః శ్రీగురుదత్త**

# నవరాత్ర కీర్తనలు - అవతారిక

సంవత్సరములో వసంత - గ్రీష్మ - వర్ష ఋతువులు పూర్వభాగ మయితే శరత్ - హేమంత - శిశిర ఋతువులు ఉత్తర భాగమవుతాయి. వర్షాకాలపు రజస్సులు క్షాళనమయినాక స్వచ్ఛతతో కూడినదే శరత్కాలము. ఈ శరదృతువు ప్రారంభం ముఖ్యమయిన సంధికాలము. సంధి అంటే కలయిక (ప్రతిరోజు ఉదయం అస్తమానము అంటే పగలు రాత్రుల కలయిక) యుగాది సంవత్సరముల కలయిక.

ఈ కలయిక కొత్త ఆరంభానికి శుభసూచిక. అందువల్ల ఈ సమయంలో మనస్సు బుద్ధి చిత్తాహంకారాలు సరైన మార్గములో సక్రమంగా ప్రవర్తించాలనే శుభసంకల్పంతో సంధికాలంలో వ్రతము అనే దీక్షను ధార్మికులు స్వీకరిస్తారు. అందువల్లే ముఖ్యసంధికాలమైన (శరదృతువు మొదలవుతున్నప్పుడు) అశ్వయుజ శుక్ల పాడ్యమినాడు దేవీ శరన్నవరాత్ర దీక్షను వత్సర ప్రారంభ సమయమనే మరో ముఖ్యమైన సంధికాలంలో (చైత్ర శుద్ధ పాడ్యమి) యుగాదినాడు వసంత నవరాత్ర నవరాత్రదీక్షను సాంప్రదాయికులు స్వీకరిస్తారు.

ఈ విధంగా సంవత్సరముమొక్క పూర్వార్థము ఉత్తరార్ధముల ప్రారంభంలో రెండు సార్లు తొమ్మిది రోజుల చొప్పున వ్రతదీక్షద్వారా మనస్సును వాక్కును శరీరమును నియంత్రణ

చేసుకుని సంపూర్ణమైన స్వాస్థ్యముతో పాటుగా భగవదనుగ్రహాన్ని పొందే పద్ధతి భారతీయుల సంప్రదాయములోని ఒక దృకృథమని తెలుసుకోవాలి.

ఇక శరన్నవరాత్రి విశేషాన్ని పరిశీలిస్తుంటే ఈ వ్రతదీక్షను అచరించే నెలను ఆశ్వయుజమాసము అనీ అశిన మాసము అనీ ఇషమాసమనీ కూడ వ్యవహరిస్తారు. అశ్వినీ నక్షత్రానికి అశ్వయుక్ అనికూడ పేరు. ఈ అశ్వినీ నక్షత్ర శుభసమయంలో చంద్రుడు సంపూర్ణరూపంతో ఏ మాసంలో పూర్ణిమనాడు దర్శనమిస్తాడో ఆ మాసాన్ని ఆశ్వినమనీ ఆశ్వయుజమనీ అంటారు. వర్షర్తువువల్ల పంటలను తద్ద్వారా అన్న సమృద్ధిని జీవాంశ పరిపుష్టిని కలిగిస్తుంది కాబట్టి దీనికి ఇషమాసమని మరోపేరు. ఇటువంటి పవిత్రసమయంలో ప్రకృతిరూపమైఅన్ పరాశక్తిని అరాధించే విధానమే దేవీశరన్నవరాత్ర దీక్షా విధి.

దీక్ష అంటే ఆరోజే ప్రారంభమయ్యేది కాదు. ఆ క్రితం రోజునే దీక్షితుడు (దీక్షను స్వీకరించాలని భావించే ఆచార్యుడు) తగిన నియమాలకు సిద్ధమవ్వాలని అదే ధ్యాసలో ఉండాలని శాస్త్ర నియమము. అందుకే శ్రౌతయజ్ఞాలలోనూ ఇష్టియాగాలలోనూ అన్వాధానమనే పేరుతోనూ పూర్వసిద్ధతలు అరంభమవుతాయి. అలాగే శ్రాద్ధాదులలోనూ వ్రతపూజావిధులలో క్రితం రోజునుండే యజమాని తగిన నియమాలను పాటిస్తాడు.

పూజా హోమాదులు ప్రారంభమైనాక ద్రవ్యము వ్యక్తులు దొరకలేదనే కారణంవల్ల కార్యక్రమానికి అంతరాయం కలగకూడదు కాబట్టి అవసరమయ్యే సంభారాలను ముందరగా ఏర్పాటు చేసుకుని దైవాపచారాన్ని నివారించుకోవాలని కూడ శాస్త్రము

బోధిస్తున్నది. ఇది దైవాన్ని అహ్వానించడానికి భక్తుడు చూపే శ్రద్ధకు ప్రేమకు తార్కాణమే గానీ బాహ్యాడంబరాల ప్రదర్శనకోసం కాదని గ్రహించాలి. అందివల్లే శ్రీ స్వామీజీ నవరాత్రి దీక్షకు క్రితం రోజున అమావాస్యనాడు సాయంకాలం సంభారాలను ఋత్విక్కులను సమావేశపరిచి వారికి దీక్షా సంకల్పాన్ని వ్రతవిధానాలను సూక్ష్మంగా వివరిస్తారు.

ఆ సంకల్పమే ఈ మొదటి కీర్తన. ఈ కీర్తనలో శ్రీ స్వామీజీ ప్రధానంగా భావనచేసే దేవతా నామము వనదుర్గా స్మరణ అన్నార్చన ద్రవ్యార్చన నవచక్ర అధిదేవతాస్మరణల ద్వారా నవరాత్ర పూజావిధి సంగ్రహ స్వరూపం వివరించబడింది.

## 1. ఆరిరాధయిషామి దేవీం పరేశీం

(దీక్షావిధానము ద్రవ్యదేవతా వివరణ సంకల్పము)

*పల్లవి:* ఆరిరా-ధయిషామి దేవీం పరేశీం

శ్రీమాతరం భావయామీహ భక్త్యా

*అప:*ఆశ్వినే మాసే శరదృతౌ దేవీ

నవరాత్ర పూజా వ్రత దీక్షితోహం

1. శ్రీశైల పుత్రీం ప్రతిపద్దినే తాం

క్షీరౌదనార్చా ప్రీతాం సుగాత్రీం

హారిద్రపూజ్యాం శ్రీగౌరికాం తాం

త్రైలోక్య మోహన చక్రేశ్వరీం భజే ₁

₂ శ్రీ బ్రహ్మచరిణీం దినకే ద్వితీయే

రాజరా-జేశ్వరీం హరసుందరీం తాం

ముద్గాన్న శాటికా పరిపూజనేన

సర్వేష్టపరి పూర-యిత్రీం భజామి ₂

₃ యా చంద్రఘంటేతి దుర్గిలక్ష్మీతి

దివసే తృతీయే కిల పూజ్యతే చ

సర్షపౌదన కుంకు-మార్చా సుతుష్టా

సర్వసంక్షోభిణీ చక్రేశికావ్యాత్ ₃

₄ కూష్మాండ దేవతే మీనాక్షి దేవి

త్వంవై చతుర్థ్యాం ప్రసమిజ్యసేహి।

శాకాన్న పుష్పాది-భిస్సేవ్యసే త్వం

సర్వసౌభాగ్యదాం త్వాం చింతయామి ₄

₅ యా స్తూయసే పరా శక్తిరుత్తంసా

స్కందమాతా పంచ-మే దినే మహతీ

చిత్రాన్న తుష్టామ్ల-ఫలమార్చ్య దేవీం

సర్వార్థసాధికాం శిరసానమామి 5

6 మూలభాన్విత దినే సప్తమే షష్ఠే

హేసరస్వతిదేవి కాత్యాయనిత్వాం

నాగవల్లీ పూగమధురౌదనైస్తు

సర్వరక్షాకరీం ప్రసమర్కయామి 6

7 సప్తమీ పూజనే కాలరాత్రీతి

త్వంవిశాలాక్షీతి సంసేవ్యసేహి

ఆమ్లాన్న మాషచ-క్రైఃపూజ్యసేయా

సర్వరోగాన్హంధి మూలశక్తే మే 7

8 దుర్గాష్టమీ పూజ-నే మహాగౌరీ

చండికారాధ్యతే సర్వశక్తి స్సా

గౌడాన్న సౌవర్ణ నిష్కైస్సమార్చ్యా

సర్వసిద్ధిప్రదా సంత్రాయతాం నః 8

9 యా మహానవమీ ది-నే సిద్ధిదేతి

తోష్టూయమాణా ఖలు శక్తిదుర్గా

దధ్యన్న సక్తావారికేళేజ్యా

అనందదాయికా హృది భావ్యతే సా ॥ 9

10 విజయాఖ్య దశమీ ది-నే పరాదేవీ

రాజరాజేశ్వరీ సకలాప్రపూర్ణా

నవచక్రవాసినీ నవదుర్గికా మాం

శ్రీసచ్చిదానంద ఘనరూపికావ్యాత్ ॥ 10

**భావార్థము**

***పల్లవి*** భక్తితో శ్రీమాతను భావించి పూజిస్తున్నాను. ఈ పుణ్యస్థలములో శరదృతువులో ఆశ్వయుజ మాసములో దేవీ నవరాత్రి పూజావ్రతదీక్షను స్వీకరించి ఆ పరాశక్తిని పూజించాలని సంకల్పిస్తున్నాను.

***చరణం*** 1 మొదటి రోజయిన పాడ్యమినాడు అరాధ్యదేవత శ్రీగౌరీదేవిని నవదుర్గలలో మొదటిదయిన శైలపుత్రీ (దుర్గా)దేవి గానూ శ్రీ చక్రములో మొదటి ఆవరణ భూపురములోని త్రైలోక్య మోహనచక్రేశ్వరిగానూ భజించి క్షీరాన్నముతోనూ పసుపుతోనూ సేవను సమర్పిస్తాను.

***చరణం*** - రెండవ రోజున విదియనాడు అరాధ్యదేవత శ్రీరాజ రాజేశ్వరీ దేవిని బ్రహ్మచారిణీ (దుర్గా)దేవిగానూ రెండవ ఆవరణ అయిన షోఅశ దళములలోని సర్వాశా పరిపూరక చక్రేశ్వరిగానూ ముద్గాన్నముతోనూ ఉత్తరీయ వస్త్రములతోనూ సేవిస్తున్నాను.

***చరణం*** - మూడవనాడు తదియరోజున చంద్రఘంటా(దుర్గా)దేవి గానూమ్ మూడవ ఆవరణ అయిన అష్టదళపద్మములో సర్వసంక్షోభిణీ చక్రేశ్వరీగానూ పూజింపబడే అరాధ్యదేవత శ్రీ దుర్గిలక్ష్మీదేవిని ఆవపెట్టిన అన్నముతోనూ కుంకుమతోనూ సంతోషింపచేస్తాను. ఆ తల్లి రక్షించుగాక.

***చరణం*** - చతుర్థినాడు కూష్మాండదుర్గగా పూజింపబడే ఓ మీనాక్షీదేవీ! శాకాన్నము (కూరగాయలతో కలిపి వండిన అన్నము తోనూ) పూలు మొదలైన ద్రవ్యములతోనూ సేవింపబడుతున్నావు నాల్గవ ఆవరణ అయిన చతుర్దశారములో సర్వసౌభాగ్యచక్రస్వామిని నిన్ను ధ్యానిస్తున్నాను.

***చరణం*** - పంచమినాడు మహత్తమ అయిన పరాశక్తిదేవి స్కందమాత అనే దుర్గగా కీర్తింపబడుతున్నది. ఆ మహాదేవి అయిదవ ఆవరణ బహిర్తశారము నందుండి సర్వార్థములను నాకొసగే పరదేవత. చిత్రాన్న నివేదనవల్ల సంతసించే పరదేవతకు పుల్లని నిమ్మ పళ్ళు సమర్పించి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

***చరణం*** - ఓ సరస్వతీదేవీ! నవరాత్రులలో ఆరవ రోజుగానీ లేక ఏడవ రోజున గానీ మూల నక్షత్రముతో కూడిన శుభదినాన కాత్యాయనీ దుర్గగా నీవు కొలువౌతున్నావు. ఆరవ

అవరణ అయిన అంతర్దశార చక్రమున సర్వరక్షాకర చక్రేశ్వరివైన నిన్ను తమలపాకులు, వక్కలు, చక్కెరపొంగలి మొదలయిన మధురాన్నముతో సేవిస్తున్నాను.

***చరణం*** 7 సప్తమీ పూజనాడు కాళరాత్రిదుర్గగానూ, విశాలాక్షిగానూ సేవింపబడే ఓ మూల శక్తీ! (అన్ని శక్తులకు మూలమయిన దేవీ!) పుల్లని పులిహోర, గారెలతో మాచేత పూజింపబడే నీవు, ఏడవ చక్రమయిన అష్టకోణమునందుండి, సర్వరోగహరచక్రేశ్వరిగా రోగములన్నిటినీ హరించు.

***చరణం*** 8 దుర్గాష్టమినాడు సర్వశక్తురాలైన మహాగౌరీదుర్గగా ఆరాధింపబడే చండీదేవతను బెల్లపు అన్నము బంగారు నాణెములతో అర్చించాలి. ఎనిమిదవ ఆవరణ అయిన త్రికోణమునందు సర్వసిద్ధిప్రదచక్రేశ్వరిగా వెలుగొందే ఆ చండీదేవి మమ్ములను రక్షించుగాక.

***చరణం*** 9 మహానవమినాడు సిద్ధిదాత్రిగా స్తుతింపబడుతూ, దధ్యన్నమునందు ఆసక్తిగల శక్తిదుర్గీదేవి నారికేళ సమర్పణతో అర్చింపబడుతున్నది. చిట్టచివరి బిందుస్థానమునందు సర్వానందమయ చక్రేశ్వరిగా నెలెకొన్న ఆ పరదేవత నా మదిలో భావించబడుతున్నది.

***చరణం*** 10 విజయదశమినాడు సకలకళా ప్రపూర్ణమయిన రాజరాజేశ్వరీ రూపముతో విరాజిల్లే ఆ పరదేవత, నవచక్రములయందు నవదుర్గా రూపముతో వినసిల్లే సచ్చిదానంద ఘనరూపిణి నన్ను రక్షించుగాక.

2 **ప్రాతఃకాల ఉత్సవము, కుమారీ పూజ, పంచగవ్యప్రాశనము, నిత్యార్చన**

నవరాత్ర దీక్షా సంకల్పం అయిన తరువాత ప్రాతఃకాలము పవిత్ర నదీ జలాలను తీర్థ జలాలను తీసుకొని మొదటిరోజు పూజకు ఉపక్రమిస్తారు. నిత్య ఆరాధన స్థలమునుండి నవరాత్ర పూజామంటపానికి అమ్మవారిని మంగళ వాద్యాలు జయఘోషలు వేద మంత్రపఠనముతో ఊరేగింపులో తీసుకొని రావటం ఆనవాయితి. పూజా మంటపానికి రావటంతోనే వేదికమీదికి పల్లకి వెళ్ళగా షోడశ కుమారీపూజ ప్రారంభమవుతుంది.

కుమారి అంటే బాలిక అని ఆడుకునే చిన్నపిల్ల అని సామాన్య అర్థము. అందువల్ల రెండవ ఏడాదినుండి పదవ ఏడాది వరకు వయసుగక తొమ్మిది మంది కన్యలను దేవీస్వరూపంగా పూజించే పద్ధతి ఆగమ శాస్త్రములో ప్రసిద్ధముగా ఉన్నది. వీరిని కుమారి త్రిమూర్తి కళ్యాణి రోహిణి కాళిక చండిక శాంభవి దుర్గ సుభద్ర అనే పేర్లతో పూజిస్తారు. శాక్తేయ ఆగమ తంత్రాలలో పదహారవ సంవత్సరము వరకూ ఉన్న బాలికలను పూజించే షోడశ కుమారీ పూజావిధులు కూడా తెలుపబడ్డాయి.

ఈ పద్ధతిలో సంధ్య సరస్వతి త్రిమూర్తి కాళి సుభగ ఉమ మాలిని కుబ్జ సంఘర్ష అపరాజిత భైరవి మహాలక్ష్మి హ్రీంకాళి పీఠనాయిక క్షేత్రజ్ఞ అన్నద అనే పేర్లతో వీరిని పూజించే సాధకుడు జగత్తులోని కన్యకలందరిలోనూ శ్రీమాత స్వరూపాన్ని భావన చేస్తారు. ఈ రెండవ విధానంగా ప్రతిరోజు శ్రీస్వామీజీ కుమారీ పూజను చేసి పూజావేదికపై ప్రవేశిస్తారు.

**పంచగవ్య ప్రాశన** శరీరముతోనూ వాక్కుతోనూ మనస్సు చేతను చేసిన పాపాలు సంపూర్ణముగా నివృత్తమై సపరివారుడైన ఆచార్యునికి పూజా వ్రతదీక్షా యోగ్యత లభించేందుకు పంచగవ్య ప్రాశనము చేస్తారు.

యత్ త్వగస్థిగతం పాపం దేహే తిష్ఠతి మానుకే।

ప్రాశనాత్ పంచగవ్యస్య దహత్యగ్నిరివేంధనమ్॥

అగ్ని కట్టెలను దహించునట్లుగా ఈ పంచగవ్యము మంత్రపూతమై నా పాపాలను తొలగించాలనే భావన పై మంత్రోచ్చారణద్వారా ప్రస్ఫుటమవుతున్నది. గోక్షీర గోదధి గోఘృత గోమూత్ర గోమయ దర్భోదకాలను తగిన పాళ్ళలో కలిపి ప్రణవంతో పదిహేడు సార్లు మథించి బ్రహ్మాత్మకమైన ఈ పంచగవ్యమును శ్రద్ధతో సేవించినవారి దురితాలు శమించి పవిత్రులై శ్రీమాతృ పూజకు యోగ్యతను పొందుతారు.

ఆ తరువాత నిత్య సాలగ్రామ పూజాదు కైంకర్యాలను పంచాయతన దేవతార్చనలను పూర్తిచేసి శ్రీ చక్రార్చన పూర్వకముగా పూజావిధులు ప్రారంభిస్తారు. ఎంతగొప్ప పని చేయబ్బున్నా నిత్యకర్మలు మానకూడదనే చక్కని సందేశము దీనివల్ల మనకు లభిస్తున్నది. ఈ నిత్య కర్మలను ఆచరించటంవల్లే మనకు ఇటువంటి సదవకాశము లభించినదని గుర్తించుకొని మనకు ఉపకరించిన ఆ నిత్యకర్మలను మరింత శ్రద్ధగా చేసిన తరువాతే విశేష పూజలకు ఉపక్రమించాలి. ఈ భావం మనకు రెండవ కీర్తనద్వారా లభిస్తున్నది.

**నవరాత్రోత్సవ సంపూజ్యాం**

***పల్లవి***

**నవరాత్రోత్సవ సంపూజ్యాం ప్రణమామాద్యాం శక్తిం తాం**

**శారద మాసే చాశ్వయుజే ఆధిమ జననీ మార్చామ**

నవరత్నాదిభి రంచితే హిరణ్యపీఠే సంస్థితే

ఓంకురు మాతః పూజాం మే పంచాయతనారాధితే

చరణం

1. దేవి ప్రాతః పల్యంకే శ్రద్ధేయే త్వాం మహామహే

మంగళ్వాద్యైర్వేదరవైః పూజామండప మానేతుం

ఊరీకురుతా న్మాతస్త్వం- దూరీకురుతాత్ దురితం మే

2. కన్యాస్సకలా భావం తే ప్రాప్య హి లోకే సమాసతే

ఇతి మత్వాహంగిరితనయే షోడశ తా స్సం - పూజయే

ఊరీకురుతా న్మాతస్త్వం- దూరీకురుతాత్ దురితం మే

3. అస్థసు చర్మణి యద్దురితం గవ్యప్రాశే తన్నున్నం

తః పవిత్రోదేవీం త్వాం నిత్యార్చాభి స్సంసేవే

సచ్చిదానందే కురు కరుణాం - శరణం తేహం త్వథ కరవై.

భావార్థము

*__పల్లవి__* నవరాత్ర పూజామహోత్సవము అర్చించబడే జగన్మాతకు నమస్కారిద్దాం. మనం కూడ శరత్కాలములోని ఈ ఆశ్వయుజమాసంలో అర్చనకు ఉపక్రమిద్దాం.

***చరణం***, జనన్మాతా సేవింపదగిన నిన్ను మహోత్సవములో ఊరేగింపులో ఉదయమే పల్లకిపై కూర్చోబెట్టి మంగళ వాద్యములతోనూ వేదఘోషలతోనూ (పూజామండపం వద్దకు తీసుకొని పోవడానికి) ఊరేగించడానికి అనుమతించు తల్లీ! నా యొక్క పాపం ఈ సేవచేత దూరమగుగాక.

***చరణం***, జన్మచేతనే గొప్పదైన స్త్రీ జాతిలో పుట్టిన కన్యలందరూ నీ అంశతోనే ఉంటారని భావించి ఈ పదహారుమంది బాలికలను అర్చిస్తున్నాను. ఓ గిరికూమారీ! నీవు అనుమతించి నా మనో దోషాలను దూరంచెయ్యి.

***చరణం***, నా శరీరంలోని ఎముకలలోనూ చర్మములోనూ ఏదైనా పాపం ఉన్నట్లయితే అదంతా గవ్యప్రాశన వల్ల నశించగా పవిత్రుడనైన నేను ఇకపై సాలగ్రామ అర్చనాది నిత్యవిధులద్వారా సేవించి నీయొక్క సదనమును (శ్రీచక్రమును నవ చక్రాలను)చేసెదను. సచ్చిదానంద స్వరూపిణీ! కరుణించు.

ఓం మేధాసి దేవి! విదితాఖిల శాస్త్రసారా

దుర్గాసి దుర్గభవసాగర నౌ రసంగా

శ్రీః కైటభారి హృదయైక కృతా(అ)ధివాసా

గౌరీ త్వమేవ శశిమౌళి కృతప్రతిష్ఠ

**శ్రీచక్ర రచన**

నవరాత్ర దీక్షావిధిలో నిత్యార్చనలు పూర్తి అయిన తరువాత శ్రీచక్ర పూజావిధులు ప్రారంభమవుతాయి. ప్రప్రథమంగా పసుపుతో శ్రీచక్ర రచన జరుగుతుంది. తరువాత నవావరణలకు సూచికంగా , ఆవరణధి దేవతలను అర్చించేందుకుగానూ, నవచక్రరచన కూడా జరుగుతుంది. ఈ శ్రీచక్రార్చనా విధానానికి ప్రపంచసత్తా సిద్ధాంతానికి దగ్గర సంబంధమున్నదని వైజ్ఞానికులు అభిప్రాయ పడతారు. శ్రీచక్రము భూ ప్రస్తారమనీ, అర్ధమేరువుమనీ, పూర్ణమేరువు లేక సుమేరువుమనీ మూడు విధాలుగా భావించబడుచున్నది. పొడవు, వెడల్పు అనే రెండు కొలతలతో, రేకు మీద లేక కాగితము మీద, చెక్క మీద రచించిన చక్రాన్ని భూప్రస్తారమని అంటారు. పొడవు, వెడల్పే కాకుండా ఎత్తు అనే మూడవ కొలతను కలపడంవల్ల అర్ధమేరువు, పూర్ణమేరువు సిద్ధిస్తాయి.

సగం ప్రమాణము వరకు ఎత్తు ఉంటే అర్ధమేరువనీ, పూర్తి కొలతలు, కోణాలు, దళాలు, రేఖలు, పీఠాలు ఉన్నప్పుడు పూర్ణమేరువు అని లేక సుమేరువు అని వ్యవహరిస్తారు. ఒక్కొక్క రకమైన శ్రీచక్రాన్ని పూజిస్తే ఒక్కొక్క ఫలము లభిస్తుందని ప్రసిద్ధి. అయితే, పూర్ణమేరువును అర్చించడమువల్ల , ఆవరణ దేవతలతో కూడిన లలితా పరదేవతా అనుగ్రహము సంపూర్ణముగా లభిస్తుందని శాక్తేయులు వక్కాణిస్తారు.

మరి అందరూ పూర్ణమేరువునే రచించి, పూజించవచ్చును కదా! ఇక మిగతావాటితో పని ఏమిటి అనే సంశయము ఇక్కడ కలగవచ్చు. పరిమాణాన్నిబట్టి కైంకర్యాలు సమర్పించాలి. ఉదాహరణకు, ఒక చిన్న పిల్లవాడికి అవసరమయ్యే అన్నపానాదులు, వస్త్రాలు, అభరణాలు, నివాస స్థలాలకంటే పెద్దవారికి ఎక్కువ ఆవశ్యకత ఉంటుంది. అలాగే భూ ప్రస్తారముకంటే అర్ధమేరువుకు, దానికంటే సుమేరువుకు చేయవలసిన కైంకర్యాలు, నైవేద్యాలు, అలంకారాలు,

ఆరాధనలు అధికంగానూ విశేషంగానూ ఉంటాయి. అందువల్ల సంప్రదాయమునెరిగిన గురువుల సలహా ప్రకారముగా వారు అజ్ఞను అతిక్రమించకుండా తగిన శ్రీచక్రాన్ని ఎంచుకోవాలి (అంతేగానీ ఏది తోస్తే అది దుకాణాల్లో కొనుక్కుని తెచ్చుకోవడం అంత మంచిది కాదు).

ఇక్కడ మరో సందేహముకూడా కలుగవచ్చు. శ్రీచక్రము ఇంట్లో ఉంటేనే లాభము కలుగుతుందా లేక పూజా కైంకర్యాలు చేసేటప్పుడు ఫలితము లభిస్తుందా అని. ఇది అర్థం కావాలంటే మరో ఉదాహరణను పరిశీలించాలి.

రెండు చెకుముకి రాళ్ళను (ఇప్పటి కాలంలోని Ligiterను) తీసుకొని వంటింట్లో పెట్టినా అవసరమైన వేడి కలుగదు. అవి రాజుకున్నప్పుడే శక్తి పుడుతుంది. సనాతన సిద్ధాంతము ప్రకారంగా ప్రతు అణువులోను శక్తి చైతన్యముంది. అయితే సుప్తంగా (జడంగా) ఉండే ఈ స్థితినే జడశక్తిర్ జడాత్మికా అని లలితా సహస్రనామంలో పేర్కొన్నారు. ఆ శక్తిని అనుభవించాలంటే కొంత ప్రయత్నము సాధన కావాలి. సుప్తంగా ఉండే శక్తిని మేలుకొలిపితే ఆ శక్తి చేతనా ప్రాభవము మనకు అనుభవములోకి వస్తుంది (యోగశాస్త్రంలో కూడా సుప్త చేతనావస్థలోని కుండలినీ శక్తిని పూర్ణచేతనావస్థలోనికి ప్రాణాయామము ద్వారా ప్రేరేపించాలని బోధిస్తారు).

అందువల్ల ఇళ్ళలో శ్రీ చక్రాది మూర్తులు ఉంచుకోవడం మంచిదే గానీ వాటిలోని జడశక్తి (Passive Potential Energy) జాగృతమై క్రియాశీలము (Active Energy)గా మనకు ఉపకరించాలంటే ఉపాసన అరాధన కైంకర్యాలే మార్గము. ఈ విధానాలు గురువుల వద్ద అభ్యసించిన తరువాతే అనుష్ఠానము

ప్రారంభించాలి. అంతేగాక శ్రీచక్ర అర్చనా విధికూడా చాలా విచిత్రము క్లిష్టము. చక్కటి శ్రద్ధ మేధ ఏకాగ్రత గురుభక్తి నైపుణ్యము గలవారికే ఈ విధానము అవగతమవుతుంది.

బిందు త్రికోణ వసుకోణ దశార యుగ్మ

మన్వస్ర నాగదళ షోడశ పత్రయుక్తమ్।

వృత్త త్రయం చ ధరణీ సదన త్రయం చ

శ్రీచక్రమేత దుదితం పరదేవతాయాః॥

౯ ఆవరణలు శ్రీచక్రంలో ఉంటాయనీ వీటినే ౯ చక్రాలు అంటారనీ వీటిలో నాలుగు శివచక్రాలనీ అయిదు శక్తిచక్రాలనీ తంత్ర గ్రంథాలు వివరిస్తున్నాయి. మొదటిదైన భూపురము రెండవదైన షోడశ దళ పద్మము మూడవదైన అష్టదళ పద్మముతోబాటుగా చివరిది తొమ్మిదవదైన బిందువు ఈ నాలుగు ఆవరణలు లేక చక్రాలు శివుడికి సంబంధించినవని వర్ణించబడినాయి.

ఇక నాల్గవదైన చతుర్ధశారము అయిదవదైన బహిర్దశారము ఆరవదైన అంతర్దశారము ఏడవదైన ఆష్టకోణము ఎనిమిదవదైన త్రికోణములు ఈ ఐదు చక్రాలు (లేక ఆవరణలు) శక్తి సంబంధమని అందువల్ల ఈ అయిదు శక్తిచక్రాలని వివరిస్తారు.

వెరశి పరిశీలిస్తే కింద (మొదటి) మూడు ఆవరణలలో సుప్త చేతనముగా ఉన్న శివతత్వము తరువాత అయిదు ఆవరణలలోని శక్తితత్త్వసంయోజనమువల్ల చివరిదైన తొమ్మిదవ ఆవరణ అయిన బిందువులో సంశక్తముగా కళాప్రపూర్ణంగా భాసిల్లుతోంది అని బోధపడుతున్నది.

అందువల్లనే శ్రీచక్రం శివయోర్వపుః కామేశ్వరీ కామేశ్వర తత్త్వాల మేళవింపే శ్రీచక్రం అనీ శక్తి లేనిదే శివుడు కొద్దిగాకూడా కదలడనీ ఆచార్యులు వర్ణించారు.

ఇటువంటి శ్రీచక్రాన్ని రచించడానికి అవసరమైన సామాగ్రి పలువిధాలుగా ఉంటుంది. ఒక్కొక్క ద్రవ్యముతో శ్రీచక్రాన్ని రచిస్తే ఒక ఫలితము ఉంటుందని తెలుపుతూ శిల వెండి బంగారు స్ఫటికం మాణిక్యం మరకతం ప్రశస్త రత్నాదులతో శ్రీచక్ర రచన ఉత్తమ ఫలదాయకమని శాక్తేయ సంప్రదాయము తెలుపుతుంది. అయితే ఇందాక చెప్పుకున్నట్లు పరాశక్తి సర్వవ్యాపిని. ప్రతి అణువులోనూ పరమాణువులోనూ అంతర్లీనంగా దృష్టాదృష్టంగా ఉండే ఆ శక్తిస్వరూపం ఇంద్రియాలకు అతీతమైనది. ప్రతి వస్తువులోని ప్రతి వ్యక్తిలోని ఆశ్చర్యకరము సౌదర్య ఫలితమైన శోభ ఆ శక్తికి సంకేతమే అయినా ఆ రూపాలేవీ శాశ్వతముకాదు (బ్రహ్మాండ పిండాడముల ఉనికి అనే) సత్తా మాత్రమైన సత్య స్వరూపమే ఆ శక్తి.

ఈ నిత్యానిత్య నివేకమును మనకు బోధించడానికి గుర్తుచేయడానికి సద్గురుదేవులు మండపంలో స్వర్ణశ్రీచక్రాన్ని మాణిక్య సుమేరువును అర్చించినా ప్రధానంగా నిరాకార తత్త్వానికి ప్రతీకంగా ఒక పసుపు ముద్దను శ్రీచక్రముగా మలిచి నవావరణలనూ వాటికి సంబంధించిన కోణాలను రేఖలను వ్రాసిసుమేరు శ్రీచక్రాన్ని పూజిస్తారు. సృష్టి స్థితి లయ క్రియలు ఆ జగన్మాత లీలాజాలమని గుర్తుచేస్తూ పూజా విధిలో భాగంగా ఏ రోజుకారోజు ఆనాటి హరిద్రాది శ్రీచక్రాలను విసర్జన చేస్తారు. ఈ విధంగా సాకార నిరాకారాలకూ వైభవ నిరాడంబరాలకూ సమన్వయంగా సద్గురుదేవుల శ్రీచక్రపూజా పద్ధతులు సాగుతూ ఉంటాయి. ఈ భావాలతో కూడిన మూడవ కీర్తనను పరిశీలిద్దాం.

## 3. త్వం విభాసి జగద్ధితైషిణి

త్వం విభాసి జగద్ధితైషిణి శ్రీయుతే పరచక్రకే

అష్ట సంపద ఇష్ట కామం యచ్ఛసీద్యే జనని మే।

***చరణం***

జగతి నిఖిలే వస్తు యద్యత్ దృశ్యమానం శోభతే

నైవ శశ్వద్రూప మేతత్ కేవలం సచ్చిష్యతి

బోధమేతం కల్పయన్తీ విద్యసే పరమాణుగా

సైవ హారిద్రేసు మేరౌ భాసి మాణిక్యే సమం ।

బిందు కోణ త్రితయ వసుదశ దశ చతుర్దశ షోడశ

కోణ వసుదళ వృత్త భూపుర యుక్త చక్రం విరచయే

స్వర్ణ మరకత సద్మనో రా స్థాప్యసే పరిపూజ్యసే

కౌల సమయా చారమార్గై రర్చితే పరదేవతే ।। 2

రుక్మ తాటంకే కిరీటం కాంచికామపి శర్మదే

హార మాంగల్యాది భూషా అర్చ్యే శివభామిని

రాజసే నీరజితా వంద్యసే పరదేవతా

సమ్యసే పరమార్ధదా సచ్చిదానందాత్మికా ॥

**భావార్థము**

***పల్లవి*** ఓ జగన్మాతా!నీవు తల్లివి కాబట్టి లోకహితాన్ని కోరేదానివి. ఈ లోకాలు, గోళాలు, చక్రాకారమైన నీ స్థూల శరీరము. ఆ చక్రంలో బిందు రూపంగా సూక్ష్మ శరీరముతో నీవు నెలకొన్నావు.

జగత్తు అంతటికీ ఉపాదాన నిమిత్త కారణముగా నీవు భాసిల్లుతున్నావు. ఇలా స్థూల సూక్ష్మకారణ శరీరాలతో జగత్తు ఉనికిని సూచించే శక్తి రూపంగా ఈ శ్రీచక్రంలో ప్రకాశించే పరాశక్తీ! నా యందు సంతుష్టిచేత ఇష్టార్థాలను,అష్టసంపదలను అనుగ్రహిస్తున్నావు.

***చరణం*** ౧ ప్రపంచమంతటా అందము, వైభవము, అధికారము ఏవైతే కనబడుతున్నాయో, అదంతా నశ్వరము అశాశ్వతము. ఎల్లవేళలా మిగిలి ఉండేది సన్మాత్రము (ఉనికి మాత్రమే) అనే తెలివిని మాకు కల్పిస్తూ, ఈ పీఠంలో మాణిక్య సుమేరువులోనూ,స్వర్ణ శ్రీచక్రములోనూ, హరిద్రా శ్రీచక్రములోనూ సమానముగా ప్రకాశిస్తున్నావు (ఇందువల్ల నీ ఉనికి అణువణువునా ఉన్నదని బోధపడుతున్నది).

***చరణం*** ౨ బిందువు, కోణత్రయము, అష్టకోణము, దశకోణము, చతుర్దశ కోణము, షోడశ దళము, అష్టదళము, మూడు వర్తులాలు, మూడు భూపురాలతో కూడిన నీయొక్క నివాసముగా ఈ హరిద్రా శ్రీచక్రాన్ని రచిస్తున్నాను. సమయాచార, కౌల మార్గములచేత ఆరాధింపబడే పరాశక్తి! నీవు మరకత స్వర్ణమేరువు లయందు బీజాక్షర సంపుటిత మంత్రోచ్చారణలతో నాచేత స్థాపింపబడి పూజలుగైకొంటున్నావు.

***చరణం*** , సుఖాన్ని ప్రసాదించే పరమేశ్వరీ! హరిద్రా శ్రీచక్ర రూపిణివైన నీకు కిరీటమును, బంగారు దుద్దులు, మట్టెలు, గజ్జెలు, మాంగల్యము మొదలైన ఆభరణాలు సమర్పించి సమస్కరిస్తున్నాను. కర్పూర నీరాజనపు వెలుగులో ప్రకాశించె పరదేవతా! మా పూజలందుకొంటూ పరమార్థమనే మోక్షాన్ని ఇచ్చే సచ్చిదానంద స్వరూపిణీ! నీకు నమస్కరిస్తున్నాను.

నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః।

నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాస్స్మతామ్॥

**.నవావరణపూజ**

ప్రపంచమంతా పంచతత్వాల సంకీర్ణం (సంకీర్ణమంటే కలగలుపు). ఈ పంచభూతాలనూ, వాటివల్ల ఏర్పడిన పాంచభౌతిక ప్రపంచాన్నంతటినీ కలిపి ప్రకృతి అంటారు. ప్రకృతి శక్తిని అరాధించడం అంటే ఈ దృశ్య జగత్తంతా ప్రకృతి శక్తి స్వరూపమే అని గుర్తిస్తూ, తాదాత్మ్య భావన చేయడమే నవావరణార్చన.

సూక్ష్మంగా ప్రకృతి శక్తులను ఆరాధించేందుకు అనేక సాంకేతిక విధానాలు మన శాస్త్రాలలో చెప్పబడినాయి. వరసిద్ధి వినాయక వ్రతము, రుద్రాభిషేకాలు, యాగ విధులన్నీ ఈ కోవకు చెందినవే.

ధ్యాన ఆవాహనాది పూజా విధానాలు రెండు రకాలు. ఒకటి సాకారము.రెండవది నిరాకారము. సాకార పూజావిధానం ప్రకారంగా, అశేష పరివార సహితముగా ప్రధాన

దేవతను విపులంగా ఆగమ శాస్త్రాలలో వర్ణించినట్లుగా ఆవాహన చేయాలంటే ఆయా మూర్తులను ఏర్పాటు చేసుకోవాలి.

ప్రధాన దేవతా శక్తిని అహ్వానించడానికి మొదటగా (సింహాసనము పై పరదేవతామూర్తి వేంచేసే సందర్భనికి యుక్తమైన సన్నివేశాన్ని కల్పించేందుకు) ఆ ప్రధానదేవత యొక్క అంగదేవత పరివార దేవత ఆవరణ దేవత ఉపదేవతా శక్తులను అవాహన చేయాలి.

ఇన్ని మూర్తులను (విగ్రహాలను) ఏర్పాటుచేసుకుని తగిన ఉపచారాలను ప్రత్యేకంగా సమర్పించాలంటే అమితమైన వనరులు సంపద సమయము శ్రద్ధ అవసరము. అంత స్తోమత లేని వారంతా ప్రధాన దేవతామూర్తిని మాత్రమే ఏర్పరచుకుని మిగిలిన పరివారమంతా ఆ ప్రధానదేవతలోనే మేళవించి ఉన్నాయని భావిస్తూ ఆరాధన చెసుకుంటారు (ఎంతటి స్తోమత కలవాడైనా ఏదో ఒక సందర్భంలో ఇలా మంత్రాత్మకమైన శరీరంతో దేవతామూర్తులు విరాజిల్లుతారని భావిస్తూ అర్పించే సన్నివేశము కలుగుతూనే ఉంటుంది). ఈ సాజారపూజావిధానంలోని ఏ దీక్షా విధాననికైనా కేంద్ర బిందువు ఆపూజలోని ప్రతిమలే అవుతాయి. అందువల్ల దేవాతావాహనకు హిరణ్యము (బంగారు ప్రతిమ) లేక వెండి రాగి ఇత్తడి మట్టి ప్రతిమలలో దేవతాశక్తులను ఆవాహన చేసి అనేక ఉపచారాలను సమర్పిస్తారు.

ఇక నిరాకార పూజావిధానంలో దేవతాశక్తులను మంత్రోచ్చారణతో బీజాక్షర జపంతో ఉత్తమ స్థాయి సాధకులు చేయగలుగుతారు. ఇది వివడానికి సులభమనిపించినా సంపూర్ణంగా మానసిక ప్రక్రియ కాబట్టి చాల కష్టసాధ్యమే. పూర్ణంగా మనోనిగ్రహం కాల యోగులకే ఇది సాధ్యపడుతుంది. ఉత్తమమైన ఈ నిరాకార పూజా విధానం అందరికీ

సాధ్యపడదు కాబట్టి మనబోటివారందరికీ అందుబాటులో ఉండే మధ్యమార్గాన్ని మహర్షులు మనకు నిర్దేశించారు.

ఇదే సాకారస్థాయినుండి నిరాకార స్థాయికి తీసుకునిపోయే సాంకేతిక పూజా విధి. దీనిలో దేవతా మూర్తికి (విగ్రహానికి) గుర్తుగా ఏదైనా ఒక వస్తువును భావించడమే ముఖ్యము. అసలైన అంతరార్థమేమిటంటే ఆయా పరాశక్తియొక్క ఎన్ని రూపాలను మనం భావించినా అన్నిటిలోనూ అంతర్వర్తిగా ఉండే శక్తి ఒకటే ఆ మూలశక్తికి ఈ రూపాలన్నీ గుర్తులనే భావన స్థిరపడాలి. అన్ని రూపాలలోనూ పరాశక్తిని గుర్తించడమే ఈ మార్గానికి సార్థక్యము. పంచాయతన పూజలో సాలిగ్రామ శివలింగ స్ఫటిక శోణ శిలాదుల వినియోగము కలశస్థాపన యంత్రరచన ఈ కోవలోనివే.

ఏ గుర్తులేక పోతే మనసు చెదిరిపోయి లక్ష్యం తప్పిపోతుంది. ప్రతుమలు ఎక్కువైపోతే అలంకారాలు వైభవాలకే మనస్సు పరిమితమైపోయే ప్రమాదమున్నది. అందువల్ల ఈ సమన్వయ మార్గంలో గురి కుదరడానికి (మనకు కలిగిన సంపదలో ఉత్తమమైనవిగా భావిందబడే) పూగీ ఫలం (పక్క పండు) లేక నారికేళం (కొబ్బరి కాయ) లేక కూర్చ (దర్భల ముడి) కలశము మొదలైన వస్తువులలో వివిధ దేవతా శక్తులను ఆవాహనచేసే సంప్రదాయం లోకంలో ఉన్నది. దీనిని సంకేత మాత్రంగా మనకు తెలియబరిచే విధానమే కలశ స్థాపన.

**కలశ స్థాపనా విధి**

కలశ స్థాపన ప్రతి దీక్షలోనూ ముఖ్యంగా నవరాత్రి దీక్షలో ప్రధాన భూమికను కలిగి ఉండి దీక్షితునికి లక్ష్యాన్ని ఏర్పరుస్తుంది కలశస్థాపన అంటే ఒక బిందెను పెట్టడం అనే

సామాన్యార్థము. కానీ ఈ విధానాన్ని లోతుగా పరిశీలిస్తే అనేక విషయాలు అర్థమవుతాయి. దేవతా ఆహ్వానానికి ముందుగా అవసరమయిన సన్నివేశాన్ని కల్పించేందుకు మంత్రోచ్చారణ పూర్వకంగా కలశ ఆసాదన చేస్తారు. ఆ క్రమాన్ని పరిశీలిద్దాం.

**1. భూ ప్రార్థన**

మనకు మన ఉనికిని ఆధారమైనది ఈ పుడమి తల్లి కాబట్టి ప్రతి దైవిక కార్యక్రమములోనూ ముందు భూమిని ప్రార్థించి అనుమతుని కోరే చక్కటి ఆనవాయితీ మన భారతీయ సంప్రదాయానికి సొంతం.

**2. ఓషధి ప్రస్తారం**

ఓషధయః ఫల పాకాంతాః! పండిన వెంటనే కంకుల నుండి రాలి పడిపోయే గోదుమలు వడ్లు వంటి ధాన్యాలకు ఓషధులు అని పేరు. పంచ భూతాలలోని జీవ శక్తిని మానవులకు ఇతర జీవులకు పంచే ఓషధులను భక్తితో పరదేవతా స్థాపన కోసం ఆసనముగా పరవాలి. మనసును జీవ శక్తితో పోషించినట్లే పరదేవతా స్థాపనకు ఉద్దేశించిన ప్రధాన వస్తువు కూడా శక్తి చైతన్య భరితం కావాలనే సంకల్పం దీనిలోనే అంతరార్థం.

**3. కలశ ఆసాదన**

కలశం అంటే కుండ లేక బిందె. యజమాని శక్తి మేరకు మట్టి రాగి వెండి బంగారము మొదలైన ద్రవ్యంతో కలశాన్ని సిద్ధం చేసుకోవచ్చు. మంత్రయుక్తంగా ఓషధులపై ఈ కలశాన్ని పెట్టే ముందు తంతువేష్టనము (దారముతో చుట్టడం) అనే ప్రక్రియ చేస్తారు.

స్థాపించబోయే దేవతామూర్తి చైతన్యానికి ప్రధానమైన స్థానము నారికేళము మరియు దర్భ కూర్చ. ఇవి మూర్ధస్థానీయము కాగా ఈ కలశమే దేవతా శరీరము. శరీరానికి లోపల దుస్తులు, బయట దుస్తులు లాగ 9 పేటల దారముతో కలశాన్ని చుట్టి అందలి చైతన్యం భద్రంగా ఉండాలనే అభిప్రాయం ఇక్కడ వ్యక్తమవుతుంది.

**4. సప్త మృత్తుకలు**

మట్టి అంటే లోకంలో చులకన. కాని మట్టిలోని ప్రాణ శక్తిని వైదిక సంప్రదాయం అధికంగా గుర్తించింది. ఒక్కొక్క స్థలములోని మట్టిలో ఒక్కొక్క రకమైన శక్తి ఇమిడి ఉంటుందని తెలుపుతూ చతుష్పథము (నాలుగు దారుల కూడలి), అశ్వశాల, గజశాల, పుట్ట, సముద్రములో కలిసే నది తటము, ఒంద్రు, పొలము ఈ స్థానాల నుంచి సప్తమృత్తికలను సంగ్రహించాలి.

**5. ధాన్యములు**

నవ ధాన్యములు (గోధుమలు, వడ్లు, కందులు, పెసలు, శెనగలు, బొబ్బర్లు, నువ్వులు, మినుములు, ఉలవలు) తొమ్మిది ప్రకృతు శక్తులకు, గ్రహ దేవతలకు చిహ్నం. కాబట్టి వాటిని కూడా కలశంలో ఆసాదన చేస్తారు కొన్ని సందర్భాలలో 14 రకాల ఆరణ్య గ్రామ్య ధాన్యాలను కూడ వినియోగిస్తారు).

**6. పంచత్వక్కులు**

త్వక్ అంటే చర్మం. చెట్టు బెరడును త్వక్ అని కూడా అంటారు. జీవరసం అంతరించిన తరువాత చెట్టు పై భాగంలో మిగిలి ఉండి లోపలి కొత్త కాండానికి రక్షణగా మిగిలి పోయేదే

బెరడు. నిరంతర సృష్టి క్రమానికి లాంఛనమైన ఈ బెరడులో, ఔషధ గుణాలు మిగిలి ఉంటాయి. అందువల్ల అయిదు యజ్ఞియ వృక్షాల బెరడు ముక్కలను ఆసాదన చేస్తారు (దీని వల్ల నీరు ఎక్కువ కాలం నిలవ ఉన్నా పల్వల దోషం ఉండదు).

7. **పంచ పల్లవాలు**

చిగురుటాకులు చైతన్యానికి మంచి సంకేతం. కొత్తదనంతో కూడిన మార్పులు చైతన్యానికి గుర్తులు. కొత్తగా ఆకులు మొలిస్తే ఆ చిగురు వృక్షాలలో జీవరసానికి సంకేతమని గుర్తించి అనందిస్తాం. ఈ నవరాత్రి పూజాస్థానంలో కూడ, పరాశక్తి చైతన్యం ఇలాగే చిగురించి మనలను ఆనందింపజేయాలనే అభిప్రాయంతో రావి, జువ్వి, మేడి, మర్రి, మోదుగ, మామిడి మొదలైన చిగురుటాకులను (పంచ పల్లవాలను) కలశముపై ఆసాదన చేస్తారు.

8. **నవరత్నాలు**

అర్ఘము అంటే విలువ. బాగా విలువైన వస్తువుల వెలను విర్ధారణ చేయలేము కాబట్టి వాటిని వెలలేనివి, విలువ కట్టలేనివి అంటాము. దేవతా స్థాపనముయొక్క విలువను మరింతగా తెలియపరచేందుకు ఇటువంటి అనర్ఘ్య రత్నాలను (నవరత్నాలను) కూడ ఆసాదన చేస్తారు.

9. **సప్త ధాతువులు**

ధాతువులు అంటే సృష్టికి మూలమైన భౌతిక పదార్థాలు. వీటిలో ముఖ్యమైన బంగారు, వెండి, రాగి, అభ్రకం, తగరం, సీసము, ఇనుము అనే 7 ధాతువులను కలశంలో ఆసాదన చేసి,

ప్రకృతిలోని మౌలిక శక్తులను మేళవిస్తారు. మన శరీరము అంతా కూడా [7] ధాతువుల సంకీర్ణమే అని కూడా జ్ఞాపకం చేస్తుంది ఈ ప్రక్రియ.

### 10. పవిత్ర తీర్థాలు

అపో వా ఇదం సర్వం అనేది శ్రుతు వాక్యము. ప్రపంచంలో పవిత్రతకు సంకేతమైన ఏడు వస్తువులలో పారే (ప్రవహించే) నీరు ఒకటి. జీవశక్తికి ప్రత్యక్ష నిదర్శనముగా భావించబడే నీటిని సర్వదేవతా ధామంగా వేదం అభివర్ణించింది. అందువల్ల గంగాది పవిత్ర నదీ తీర్థ సాగర జలాలను వాటి అధిష్ఠాన దేవతా స్మరణపూర్వకంగా కలశంలో నింపుతాము.

### 11. వస్త్ర అలంకారం

అలంకారానికి ఒక వస్త్రాన్ని కలశం చుట్టూతా చుట్టి దేవతాస్థాన శోభను ఇనుమడింప చేస్తున్నాము.

### 12. నారికేళ దర్భ కూర్చ స్థాపన

ఇలా పూర్వాంగ ఆసాదన తరువాత ప్రధానమైన దేవతా స్థానముగా పూర్ణఫలాన్ని పీచు తీయని (తొక్క ఒలవని) కొబ్బరికాయ మరియు [27] దర్భల కూర్చను కలశంలో వేసి ప్రధాన దేవతా మంత్రాలను బీజ సంపుటితంగా ఉచ్చరించి వారి రాకనూ వారి ఉనికిని మన ఎదుటనున్న కలశంలో అంటే దానిపైన శిఖరప్రాయముగా శిరస్సులా ఉన్న కొబ్బరి కాయలోనూ కూర్చలోనూ కూర్చలోనూ భావన చేస్తాము.

శ్లో॥ నారికేళ సముద్భూత త్రినేత్ర హర సంభవ

శిఖయా దురితం సర్వం పాపం పీడాంచ మే సుద॥

పూర్ణ ఫలము కలశముపై పెట్టేటప్పుడు చెప్పే ఈ మంత్రం మూడు కళ్ళతో ముక్కంటి శివుడి అంశను గుర్తుచేస్తూ దీక్షా కాలంలో మనకు పీడలు తొలిగాలనీ పాపాలు దూరమవ్వాలనీ - అంటే పాపాలు చేసే ప్రవృత్తే మటుమాయ మవ్వాలనీ ప్రార్థిస్తోంది. ఇలా ఈ మంత్రం కొబ్బరి కాయను ఒలిచే పద్ధతునీ ఒలిచిన తరువాత పైన శిఖను (పీచును) అట్టే పెట్టడంలో రహస్యాన్ని సూచుస్తున్నది.

కూర్చాగ్రై రాక్షసాన్ ఘోరాన్ ఛింధి కర్మ విఘాతినః।

త్వా మర్పయామి కుంభేస్మిన్ సాఫల్యం కురు కర్మణి॥

[27] దర్భలతో చేసిన కూర్చను దేవతా ప్రతీకగా నిర్ణయించుకొని ఈ మంత్రముతో కలశంలో ఆసాదన చేస్తారు. దర్భలు పవిత్రతకు సంకేతం మాత్రమే కాదు మన మనస్సులను నియంత్రించడానికి గొప్ప సాధనం. పూజలు హోమాదిదైవిక కార్యాలు చేసేవారికి సంభవించే ఆటంకాలలో ముఖ్యమయినవన్నీ మానసికమైనవే. చంచలమైన మనస్సుకు రజోగుణము దానికి సహకరించే తమోగుణము ఆసురీ శక్తులని పిలవబడతాయి.

కూర్చునే ఆసనం చేత ధరించే పవిత్రాలు (రెండు దర్భ పుడకలు) పూజా విధిలో తరచుగా వినియోగించే దర్భలు - ఇలా దర్భల నిరంతర స్పర్శవల్ల మనస్సు శరీరముల రాజసిక ప్రవృత్తి విచ్ఛిన్నమై సాత్విక భావానికీ దానికి సూచనమైన నిశ్చలత్వానికీ మనస్సు అలవాటు పడుతుంది. ఇలా మనస్సుకు నిశ్చలత్వము సిద్ధించడమే వ్రత విధానానికి సాఫల్యం.

సుగంధ ద్రవ్యాదులు

కలశస్థాపన విధిలో పైన పేర్కొన్న ద్రవ్యాలన్నింటితో పాటుగా (దుర్గంధాన్ని నివారించేందుకు) సువాసనా భరితమయిన ద్రవ్యాలను (పచ్చ కర్పూరము, లవంగము, కుంకుమపువ్వు, వట్టివేరు, జవ్వాది, అత్తరు మొదలగునవి) కలిపి, ఆ పైన పూలతో అలంకరిస్తారు.

.సంఖ్య

నవరాత్రి పూజా విధానములో . సంఖ్యకు చాలా విశేషమున్నది. . అనే అంకెకు ఉన్న విశేషన్ని పరిశీలిస్తే.ఒంటి అంకెలలో అత్యధికమైన విలువ కలిగినది .

నవ అంటే కొత్తది అని మరొక అర్థం. అత్యధిల విలువతో కూడిన కొంగ్రొత్త ఫలాలు మనకు లభించాలనే సంకేతం ఈ .సంఖ్య వినియోగం వల్ల స్పష్టమగుతుంది.

. రోజులలో . దేవతలను . కలశాలలో ఆవాహన చేసి, ప్రతి రోజు . ధాన్యాల పొడులను . ద్రవ్యాలతో సంయోజనం చేసి (పంచామృతాలు, పసుపు, కుంకుమ, కర్పూరపు పొడి, నీరు) . చక్రాలు రచించి . ప్రదక్షిణలు చొప్పున . ఆవరణ దేవతలను అర్చిస్తూ, నవ గుణితమైన (. అంకెతో గుణింపబడి నవ గుణ సమన్వితమైన) పూజావిధానాన్ని అవలంబిస్తాము.

ఇంకా దీనిలో అంతర్భాగంగా . హోమాలు . అర్చనలు . మంది సువాసినీ స్త్రీలకు . మంది బాలికలకు పూజలు . రకాలైన నైవేద్యాలు . రకాలైన అన్నాల అర్చనలు . కీర్తనలు . స్తోత్రాలు కూడా ఉంటాయి. ఇలా అంతటా . సంఖ్యతో ముడిపడి నవ ద్రవ్య సంకీర్ణ సంయుక్తమైన

నవావరణ పూజయొక్క భావాన్ని , మాత్రలతో నడిచే సంకీర్ణ గతిలోని కీర్తన ద్వారా తెలుసుకొందాం.

ఓం హేతు స్సమ స్తజగతాం త్రిగుణాపి దోషైర్

న జ్ఞాయసే హరిహరాదిభి రప్యపారా।

సర్వాశ్రయా(అ)ఖిల మిదం జగదంశ భూత

మవ్యాకృతా హి పరమా ప్రకృతి స్త్వమాద్యా॥

**భద్రం కురుషే హి**

మాత్రలు సంకీర్ణగతి)

**పల్లవి** భద్రం కురుషే హి - లోక త్రితయస్య

హే దుర్గే మాత - రారాధ్య స్వాథ

దేవీ నవరాత్ర పూజారంభే తు

నవ సంఖ్యాకేషు నవధాన్యాసన్న

కలశేష్వావాహ్య వరివస్యా మర్ప యై ,

గోధూమ వ్రీహి ముద్గాఢక చణక

తిల మాష కుళుత్థ కవిధాన్య హరిద్ర

కుంకుమ కర్పూర చూర్ణా న్యభిమిశ్ర

పంచామృత యుక్త నవ చక్రాణ్యర్చయై ₂

కోణనాలిఖ్య వస్త్రైరాభూష్య

సంగృహ్యైకైక మపచేషియాథ

నవ నవ కృత్వశ్చ పరితః క్రామ్యన్ హి

ధ్యాన స్నానప్ర దీపాన్ వినివేద్య

నీరాజయితుం త్వ మురరీ కుర్వర్చ యై ₃

ఖండగతి) ఏవం నవావరణ - పూజాం నిధాయ

సర్వేశ్వరీం ప్రత్య హం భావయామి

నవ నవాకారిణీం దుర్గా భవానీం

సచ్చిదానందినీ మిహ భావయామి

**భావార్థము**

**పల్లవి** నవదుర్గా స్వరూపిణివైన ఓ దుర్గాదేవీ! ఇక మా చేత పూజింపబడుతూ ముల్లోకాలకు క్షేమాన్ని కలుగచేస్తున్నావు కదా!

1) దేవీ నవరాత్ర దీక్షలో మొదటగా ధాన్యాలపైనున్న కలశాలలో నిన్ను నవదేవతా స్వరూపిణిగా ఆవాహనచేసి ఆరాధనలను సమర్పించెదను.

2) గోధుమలు, వడ్లు, కందులు, పెసలు, శనగలు, శుక్రుని ధాన్యమైన బొబ్బర్లు, నువ్వులు, మినుములు, ఉలవలు, పసుపు, కుంకుమ, కర్పూరము - వీటి పొడులను బాగుగా కలిపి పంచామృతాల మిశ్రమంతో చేర్చి, తయారుచేసిన చక్రాలను అర్చింతును.

3) అర్చనకు ముందు, చక్రాలపైన విధి పూర్వకంగా కోణాలను రచించి, వస్త్రాలతో అలంకరించి, ఒక్కొక్కటి చేత ధరిస్తూ సార్లు చొప్పున ఈ మండపం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ, ధ్యానము, స్నానము, దీపము, నివేదన, నీరాజనము అనే ఉపచారాలతో నిన్ను అర్చించెదను. అంగీకరించు తల్లీ నిన్ను పూజిస్తాను.

ఈ విధంగా నవావరణ పూజలు చేసి ప్రతిరోజూ కొత్తదనము ఉట్టిపడే చైతన్య శక్తిని, నవదుర్గాత్మిక అయిన భవానీ దేవిని సచ్చిదానంద స్వరూపంగా భావిస్తాను.

**5. అన్నార్చన**

ఆవరణలు పూర్తి అయిన తరువాత, తరువాత ఘట్టము అన్నార్చన. అన్నార్చన అనే పదములోని స్వారస్యం (పదముయొక్క వ్యుత్పత్తి భేదముచేత) నాలుగు విధాలుగా ఉంది.

(1) అన్నముచేత అర్చన

(2) అన్నము కొరకు అర్చన

(3) అన్నమునకే అర్చన

(4) అన్నమునందు అర్చన

ఈ నాలుగు రకాలైన నిర్వచనాలు నవరాత్రి పూజలో సరిపోతాయి. ఏ రోజున అర్చనకు నిర్ణయించిన అన్నమును ఆ రోజు మూల సంపుటం ఎదుట రాశిగా పోసి ఆ రాశిలో శిఖర (బిందు) స్థానంలో బీజాక్షర సముపేతమయిన షట్కోణ రచన చేసి ఆ షట్కోణం మధ్య భాగంలో స్వర్ణ పాత్రను ఉంచి దానిపై మరకత మేరువును స్థాపించడం మొదటి దశ.

ఆ పైన పంచామృత పూరితాలైన 5 కలశాలను నాలుగు దిక్కుల (మూలల)లోనూ తూర్పున స్థాపించి నీటితో నింపిన కలశాలను అన్నరాశిపైన క్రమశః ఉంచటంతో అష్టోత్తరశత (108) కలశాల ఆసాదన పూర్తి అవుతుంది. ఆ తరువాత హయగ్రీవప్రోక్తమయిన లలితాత్రిశతినామ పారాయణ జరుగుతుండగా వివిధ ఉపచారాలతో (వస్త్రాలంకారాలు పుష్పాలంకారాలు త్రికోణముగా మడత పెట్టిన 32 వస్త్రాలతోనూ కొబ్బరికాయ నివేదన నీరాజనాది ఉపచారాలతో) అమ్మవారిని సేవించడమే అన్నార్చనయొక్క సంగ్రహ స్వరూపం.

ఈ అన్నార్చన అనే పదములోని నాలుగు అర్థాలు తెలిస్తే ఈ కార్యక్రమ ఆంతర్యం బోధపడుతుంది. ప్రతి ఆలయంలోనూ ప్రతి పూజా విధానంలోనూ భగవంతుడికి మనం తినే ఆహారాన్ని నివేదన చేసే పద్ధతి ఉండనే ఉంటుంది. అయితే స్వామీజీవారి పూజా విధానంలో పైన చెప్పిన నాలుగు నిర్వచనాలకు సరిపోయేటట్లుగా అన్నార్చన విధానం అమలులో ఉంది.

1. **అన్నము చేత అర్చన:**

అన్నము చేత అర్చన అంటే అన్నపు మెతుకులను రాశిగా పోస్తూ ఇన్ని లక్షల మెతుకులతో దేవిని పూజించడం అనే భావన - అంటే సకల చైతన్య రూపిణి అమ్మవారిని ఈ అన్న పులాకగత జీవాంశతో అర్చిస్తూ జీవాత్మ పరమాత్మ అభేదాన్ని గుర్తు చెయ్యడమే ఒక స్వారస్యం.

**2. అన్నము కొరకు అర్చన**

జీవాంశల స్వీకరణతో నెట్టుకొచ్చే మన జీవనయాత్ర కొనసాగాలంటే భగవత్ప్రసాదితమైన అన్నము లోని జీవాంశ మనకు లభించాలి. భగవంతుడికి ఆహారములోని జీవశక్తిని సమర్పించడమే నివేదన ఆ తరువాత కృతజ్ఞతతో మిగిలిన ఆహారమును భక్తితో స్వీకరించడమే ప్రసాదము. ప్రసాదము అంటే ప్రసన్నత అని ముఖ్యార్థము. భగవంతుడు మనపట్ల ప్రసన్నుడు అయినాడు కాబట్టి ఈ రోజు నాకు ఆహారం లభించిందని అంటే నాకు ఈ రోజు లభించిన ఆహారము భగవంతుని ప్రసన్నతకు సూచన అని గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతతో ఆ నివేదన చేసిన ఆహారాన్నే భగవంతుడి ప్రసాదమని వ్యవహరిస్తాము.

ఈ ప్రసాదంకోసం (అన్నంకోసం) సమర్పించే అర్చనే అన్నార్చన అని మరో అర్థం.

**3. అన్నానికి అర్చన:**

అన్నం బ్రహ్మ - పరమాత్మ రూపం. అందువల్ల మనను బతికించే ఈ అన్న రాశికి పూజ ఒనర్చడమే అన్నార్చన. ఇదే అన్నపూర్ణేశ్వరీ పూజ. ఈ పద్ధతి భారతీయ సంప్రదాయంలో అక్కడక్కడ దేవాలయాలలో అగుపడుతూ ఉంటుంది. దేవతామూర్తి ముందట అన్నాన్ని రాశిగా పోసి అన్నపూర్ణేశ్వరిగా భావించి పుష్పమాల అర్పించి అరతి చూపి తరువాత వడ్డన

అన్నదానము - ఈ పద్ధతులు హోరనాడు అన్నపూర్ణేశ్వరీ అలయంలోనూ, తమిళనాడులోనూ. నేపాల దేశములోనూ ఇతర ప్రాంతాలలో ఆనవాయితీగా వస్తోంది.

**అన్నమునందు అర్చన:**

అధికరణమంటే ఆధారము. అన్నమనే అధికరణములో మేరువును, జల కలశాలను స్థాపించి అర్చించడమే అన్నము పై చేయబడే అన్నార్చన.

ఈ నాలుగవ విధానము శ్రీ స్వామీజీవారి పూజా విధానంలోని ప్రత్యేకత. నశ్వరము (కాబట్టి అంటు) అనబడే అన్న రాశిలోనూ, అనశ్వరమయిన పవిత్ర మాణిక్య, మరకత, సుమేరువులోనూ అభేదాన్ని దర్శించడమే ప్రధానమైన అభ్యాసము. తాత్త్విక దృష్టితో పరికిస్తే, ఈ రెండూ పరాశక్తికి సంస్థానభేదాలే కాని వాస్తవిక భేదాలు కాదని బోధించడమే దీనిలోని స్వారస్యము. ఇలా నాలుగు విధాలైన భావాలతో అలరారుతూ భక్తులను అదుకొనే అన్నార్చనయొక్క భావాన్ని అయిదవ కీర్తనద్వారా తెలుసుకొందాం.

అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణవల్లభే।

జ్ఞాన వైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి।

జాతవేదా స్త్వం చ వైరోచనీ త్వం (ఖండగతి)

**పల్లవి** జాతవేదా స్త్వం చ వైరోచనీ త్వం

వైశ్వానరీ దేవి అన్నపూర్ణేశీ

ఉద్ధవే నవరాత్ర నామకే పర్ణే

అన్నాధిదేవతా మభ్యర్చయే త్వాం

అన్నమేవ ప్రాణ - మన్నమేవాపాన -

మన్నమేవ వ్యాన - మన్నం హ్యుదానం

అత్తి యద్భూతాని - అద్యతే భూతైశ్చ

తత్పరం బ్రహ్మాన్న - ముచ్యతే వేదే

అన్నేన పూర్ణాని - హి త్వయా భూతాని

ప్రాణీని తస్మాత్ త్వ - మన్నపూర్ణా శ్రుతా ।

సర్వాదేవాత్మికా ఆపః ప్రశస్తాః

తాభిరాపూరితాన్ సాష్ట శత కలశాన్

ఓదనేభినిధాయ మేరు మథ మన్వే

సర్వదైవత్యం బ్రహ్మేద మన్నం

హవ్యం కవ్యం చైత దర్చితం ప్రేష్ఠం

ఏతద్గతా శక్తి రస్మాన్ ప్రవిశ్యాత్ ॥

త్వత్సేవనేనాహ మాప్యాయయాని

సత్త్వవృద్ధి స్స్యాత్ - బ్రహ్మాత్మ భావః

అన్నపూర్ణే మాం ప్రసమేధయ త్వం

సచ్చిదానందేన సంపూరయాస్మాన్ ॥

**భావార్థము**

***పల్లవి*** ఓ అన్నపూర్ణేశ్వరీ! నీవు వైశ్వానర స్వరూపముతో జీవులలో ఉంటున్నావు. జీవుల శరీరాలను ప్రకాశింపచేసే వైరోచనివి నివే. జ్ఞానం కలుగచేసే జాతవేద స్వరూపానివి కూడా నీవే. ఓ అపర్ణాదేవీ! నవరాత్ర నామక మహోత్సవాలలో అన్నాధి దేవతవైన నిన్ను బాగా అర్చిస్తున్నాను.

వైశ్వానరి వైరోచని జాతవేదాః అపర్ణా నామాలు

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః।

ప్రాణాపాన సమాయుక్తః పంచామ్యన్నం చతుర్విధమ్॥

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్ బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।

బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా॥

భగవద్గీతలోని ఈ నాలుగు వాక్యాల ద్వారా ప్రపంచ స్థితి తత్త్వం బోధపడుతున్నది. జీవులు బ్రతికేందుకు స్వీకరించే ఆహారాదులలోని జీవాంశ అన్నరూపమైన పరబ్రహ్మా. అందువల్ల అన్నం పరబ్రహ్మ అన్నారు. భుజించిన ఆహారాన్ని పంచవాయువులతో కూడి జీర్ణముచేసి ఆ

జీవ శక్తిని శరీరమంతా పంచిపెడుతూ జీవుల జీవితానికి ముఖ్య హేతువైన వైశ్వానర స్వరూపము కూడా ఆ పరబ్రహ్మే.

విశ్వ - తైజస - ప్రాజ్ఞ అనే మూడు రూపాలతో స్థూల సూక్ష్మ కారణ శరీరాలతో స్పష్టంగా వ్యాపించిన పరబ్రహ్మములో వైశ్వానరాంశ స్థూలమయినది. వైశ్వానరుడు అంటే విశ్వములోని నరులలో ఉండే వాడని అర్థము. ఇలా అహారాన్ని జీర్ణించి జీర్ణించి కొంతకాలము తరువాత జీర్ణించే యంత్రమనే ఈ శరీరమే జీర్ణమై శిథిలమైపోతే అప్పుడు ఈ శరీరాన్నే వదిలి కొత్త శరీరంలోకి వెళ్ళేది కూడా ఆ పరబ్రహ్మమే. పరబ్రహ్మములోని ఈ అంశ వైశ్వానరీ శక్తి.

జీర్ణించుకొన్న ఆహారం శరీరమంతా వ్యాపిస్తే జీవ రసము వల్ల జీవకళ శరీరమంతా ప్రకాశిస్తుంది. ఆ విశేష ప్రకాశనమే విరోచనము అంటారు. ఆ స్వరూపాన్ని కలిగిన శక్తికి వైరోచన అనే సార్థక నామధేయము.

జాతవేదాః అంటే ఆవిర్భవించిన జ్ఞానము కలది అని అర్థము. ఆహారము లేనట్లయితే బుద్ధి పనిచేయదు. ఛాందోగ్య ఉపనిషత్తులో చెప్పబడిన శ్వేతకేతు వృత్తాంతము దీనిని నిరూపిస్తోంది (బుభుక్షితం న ప్రతిభాతి కించిత్ అని సామెత. తిండి తినాలని బుద్ధిపుడితే ఇక వాడికి ఏమీ తోచదు). తేజోద్రవ్యాది అహారము సేవించనివాడి మనస్సు ప్రవర్తించదు.మనఃప్రవృత్తి లేకపోతే జ్ఞానము కలుగదు. అందువల్ల శరీరంలోని అన్ని భాగములతో పాటుగా మెదడుకు కూడా జీవశక్తి అందితేనే ఆ మెదడు సక్రమంగా పనిచేసి

మనో బుద్ధి ప్రవృత్తికి ఆస్పదమవుతుంది. అందుచేతనే ఈ జీవశక్తికి జాతవేదాః అనే నామము సిద్ధించింది.

ఆకులు (పర్ణాలు). అలములు కూడ పరిత్యజించి శివుడికోసం ఘోర తపస్సు చేసిన దృఢ దీక్షము కలిగిన పార్వతీదేవికి అపర్ణ అని మరో పేరు. వ్రతము అంటే ముఖ్యార్థము నియమము తత్రాపి ఆహార నియమము ఉపవాసము.

అందువల్లే ఉత్తరదేశంలో ఇప్పటికి ముఖ్యమైన దీక్షలలో ఉపవాసాలు జనసామాన్యులందరూ చేసే ఆచారము ఉన్నది. మనిషికి ముఖ్యమైన శత్రువు ఆకలి అని వేద వాక్యాలు వ్యాఖ్యానిస్తాయి (క్షుత్ ఖలువైమనుష్యస్య భ్రాతృవ్యః). అందువల్ల అపర్ణా నామాన్ని స్మరిస్తూ ఆ దృఢదీక్షవల్ల స్ఫూర్తి పొందుతూ వ్రతసిద్ధినందుకోవాలి అనే భావం మనకు అందుతున్నది.

అంతేగాక ఆ అపర్ణాదేవి దృఢదీక్ష - ఉపవాస సామర్థ్యం మనకు లభించేంతవరకు మాకు శరీరధారణకు అవసరమైన అహారాన్ని ప్రసాదించమనే అభ్యర్థనకూడ వ్యక్తమవుతూ ఉంటుంది.

ఆహారము కాస్త ఆలస్యమైతే విలవిల్లాడిపోవడం అన్ని జీవులలో కనబడే లక్షణమే గదా. తెల్లవారుఝామునుండి పూజావ్రత దీక్షలో ఉన్న భక్తులు అకలి బాధకు లోనవుతారు కాబట్టి అన్నార్చన ప్రసాదమును మధ్యాహ్నకాలంలో భక్తులందరికీ పంచడం బ్రహ్మభోజనమే విధానంతో మంది శ్రోత్రియులకు వ్రతదీక్షా తత్పరులకు సమారాధన చేయడంకూడ ఈ అన్నార్చనలో అంతర్భాగమే).

***చరణం*** 1 జీవులచేత ఆరగించనడేది అన్నము. ఆరగించి, ఆరగించి జీవి శరీరాలు అరిగిపోయేటట్లుగా చేసేది కూడా ఈ అన్నమే. అందువల్ల అన్నమంటే జీవులు ఆరగించుకొనేది మరియు జీవులను అరగదీసేది. ఈ నిర్వచనము యజుర్వేదములోని తైత్తిరీయ ఉపనిషత్తులో చెప్పబడినది. ఈ అన్నమే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయు రూపంగా మార్పుచెందుతూ జీవుల శరీరంలో జీవన క్రియను సాగుస్తుంది.

ఈ అన్నమే పరం బ్రహ్మ అనీ, అన్నము వల్లే జీవాలన్నీ పూర్ణమవుతాయనీ, (అన్నము లేకపోతే అపూర్ణాలనీ) జీవులన్నీ అన్నమువల్లే జీవవంతులు అవుతాయని కూడా వేదము బోధిస్తున్నది. ఓ పరాశక్తీ! నీ అన్నశక్తిచేత జీవాలను పూర్ణము చెయ్యడంవల్ల అన్నపూర్ణ అనే పేరు నీకు కలిగినది.

***చరణం*** 2 నీరు అంటే సర్వ దేవతామయము. (ఆపో వై సర్వా దేవతాః) అందువల్లే ప్రశస్తము. ఆ నీటితో నింపిన 108 కలశాలను, సుమేరు శ్రీచక్రాలతో పాటుగా అన్నమునంది ఉంచి ఊ విధంగా భావిస్తాను. ఈ అన్నము, ఈ జలము సర్వదేవతా స్వరూపమయిన పరబ్రహ్మమే. ఇదే దేవతలకు యజ్ఞేశ్వరుని ద్వారా హవ్యమనీ, పితృదేవతలకు కవ్యమనీ ప్రియతమంగా ఉన్నది. దీనిలోని జీవశక్తి మా యందు ప్రవేశించుగాక!

***చరణం*** 3 ఓ అన్నపూర్ణాదేవీ! నిన్ను సేవించడంవల్ల నేను వర్ధిల్లాలి. నా యందు సత్త్వము (సాత్విక భావన) పెంపొందాలి. సత్త్వమయమైన అభ్యాసము వల్ల బ్రహ్మాత్మ భావన కూడా మరింతగా సిద్ధించాలి. ఆ విధంగా మాకు వృద్ధిని కలిగించు మరియు సచ్చిదానందముచేత సంపూర్ణతను చేకూర్చవమ్మా.

మాతా మే పార్వతీ దేవీ పితా దేవో మహేశ్వరః।

బాంధవా స్సర్వభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్।

నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్యరత్నాకరీ

నిర్ధూతాఖిల ఘోరపావనకరీ ప్రత్యక్షమహేశ్వరీ।

ప్రాలేయాచల వంశపావనకరీ కాశీపురాధీశ్వరీ

భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ।

## హోమ విధి

భగవదారాధనా విధానాలు లోకంలో అనేకం ఉన్నాయి. అనేక దేశాలలో పలురకాలైన విధానాలు కనబడుతున్నా విలక్షణమైన హోమ విధానం అనేది మన భారతీయ సంస్కృతికే ప్రత్యేకం.

అగ్నిర్వై దేవానాం హోతా అగ్నిం దూతం వృణీమహే మొదలైన వందకకొద్దీ వేద వాక్యాలవల్ల దేవతలందరికీ తగిన రీతిలో హవిర్భాగాలు అందించేవాడు అగ్ని అనీ అందువల్ల ఈయనను హవ్యవాహన హవ్యవాట్ అని పిలుస్తారనీ తెలుస్తుంది. దేవతలకు ప్రతినిధిగా మన హవిర్భాగాలను స్వీకరిస్తాడు కాబట్టి ఆయనను దేవదూత అని స్వీకరించిన హవిర్ ద్రవ్యాలను ఆరగిస్తాడు కాబట్టి హుతాశీ అనీ యజ్ఞ ప్రక్రియకు అధినాయకుడు కాబట్టి యజ్ఞేశ్వరుడనీ అనేక నామాలు అగ్నికి ఉన్నాయి.

హోమమంటే దేవతనుద్దేశించి ద్రవ్యాన్ని అగ్నికి సమర్పించడమే. ఈ ప్రధాన హోమంతో పాటుగా ఈ విధానంలో ముఖ్యమైన ఘట్టాలు పరిశీలిస్తే హోమద్రవ్యాన్ని (వస్తువులను) సేకరించడం వాటికి సంస్కారముచేసి దేవతా నివేదనకు యోగ్యంగా చెయ్యడం ఆహుతుల సంఖ్యకూ సందర్భానికీ తగిన హోమకుండాన్ని ఏర్పరచడం మనకు ఆప్తుడైన అగ్ని దేవుడిని అర్చించడం హోమం చెయ్యడానికి అవసరమైన పాత్రలను సిద్ధపరచుకోవడం హోమ సమయంలో దురాలోచనలు చాంచల్యము నిద్ర ఆలస్యము - ఇటువంటి ఆసురీ భావనల నుండి రక్షించుకొనే ప్రయత్నాలు ఈ హోమ విధిలో లోపాలు లేకుండా ఇండేందుకు విజ్ఞుడైన నిపుణుడైన శ్రోత్రియుడిని బ్రహ్మగా నియంత్రించడం దేవతలయొక్క అనుమతిని కోరుతూ ప్రధాన ఆహుతులను సమర్పించండం తరువాత యజ్ఞేశ్వరుడికి పూర్ణాహుతుని అర్పించి మా కర్మను లోపాలు లేకుండా పరిపూర్ణము చెయ్యమని ప్రార్థించడం ప్రదక్షిణ సమస్కారాలతో సెలవు తీసుకొనడం అని బోధపడుతుంది.

ఈ క్రియలకే అగ్నిముఖ ప్రయోగం అని పేరు. వారి వారి సంప్రదాయాల ప్రకారంగా సూత్రకర్తలైన మహర్షులు నిర్దేశించిన విధానములో అగ్నిముఖ ప్రయోగము మొదలుపెట్టి ఋత్విక్కులు బీజాక్షర సంపుటిత మూలమంత్రాలను వైదిక సూక్తాలను పఠిస్తే యజ్ఞియ ద్రవ్యాలను (సమిధలు నెయ్యి మొదలైన వస్తువులను) ప్రధాన దేవతకు ఆహుతిగా సమర్పిస్తారు. ఇటువంటి ప్రశస్తమైన హోమ విధానం దత్త పీఠంలో ప్రతిరోజు ఋత్విక్కుల ద్వారా సద్గురుదేవుల సన్నిధిలో జరగడం పరిపాటి.

ఈ వేదోక్త హోమ విధానం ఇలా ఉండగా ఆగమ సంప్రదాయంలో మరొక ప్రత్యేక పద్ధతి కూడా ఈ హోమవిధికి చేర్చబడినది. అదే సాక్షాత్తు అగ్నిలో ఇష్ట దేవతను ఆవాహనచేసి

అంగపరివార ఆవరణ పీఠ దేవతలతో సహా అర్చన సమర్పించి నైవేద్య స్థానంలో ఆహుతులను వందల వేల సంఖ్యలలో సమర్పించడం. పద్ధతులలో స్వల్ప భేదమున్నా ఆగమ సంప్రదాయము వైదిక ఆగమ సంప్రదాయాల కలబోతగా జరుగుతూ ఉంటుంది.

స్వశాఖ ప్రకారముగా అగ్నిముఖ ప్రయోగం ప్రధాన దేవతామంత్ర హోమం కలశ స్థాపన షోడశోపచార పూజా విధులను ఋత్విక్కులు నిర్వర్తించగా అవధూతవర్యులైన శ్రీ స్వామీజీ ఆసీనులై ప్రపంచానికి శ్రేయస్సు కలగాలని సంకల్పించి హోమవిధానాన్ని కొనసాగిస్తారు.

ముందుగానే అక్కడ నాలుగు జలపాత్రలు ఒక ఆజ్యపాత్ర ఆసాదన చేసి ఉంచుతారు. ప్రతిరోజు ఇంతవరకు జరిగిన అసంఖ్యాక బీజాక్షర జప ఫలాన్ని శ్రీస్వామీజీ నాలుగు పాత్రలలో జలధార రూపంగా పోస్తారు. ఈ నాలుగు పాత్రల స్థాపనలో ఒక విశేషం ఉంది. పురుషార్థాలు నాలుగు. ధర్మం అర్థం కామం మోక్షం. భక్తులకు ఈ నాలుగు పురుషార్థాలు సిద్ధించాలనే మహాసంకల్పంతో శ్రీస్వామీజీ ఈ జపాన్ని ధారపోస్తారు.

మరో విశేషం ఏమిటంటే పురుషార్థాలలో మొదటి రెంటినీ ఒక భాగంగా మిగిలిన రెండింటినీ మరొక భాగం చేస్తే ధర్మార్థం కామమోక్షం అనే విభాగం అవుతుంది. అనగా ధర్మముకోసమే అర్థం ఉండాలనీ అలాగే కామానికి (కోరికలకు) మోక్షం (విడుదల) కలగాలి. ఇదే పరమార్థ సాధనకు మంచి ఉపాయమని కూడ గ్రహించాలి.

ఇలా చతుర్విధ పురుషార్థాలకోసం సంకల్పించాక ఐదవ పాత్రలో ఆజ్యం (నెయ్యి) నింపి భక్తుల కోరికలు తీర్చమని అగ్నిదేవుడిని ప్రార్థిస్తారు. తరువాత ఇధ్మంలోని ఇరవై సమిధలను సమర్పించి అగ్నిని మరింత ప్రకాశవంతం చేస్తారు. ఇకపై ఆజ్యంతో అగ్నిలోనే షడర్ణ

సంపుటితమైన షట్కోణ మండలాన్ని రచన చేస్తారు. షడర్ణ సంపుటితమైన షట్కోణ మండలాన్ని అగ్నిలో రచించి సాంగసావరణ సపరివారంగా పరాశక్తిని భావన చేస్తూ మూల మంత్రాలతో స్వయంగా ఆహుతులు సమర్పించడం ఒక విశేషం.

ఈ సమయంలో వాజశ్చమే.............యజ్ఞేన కల్పతాం అనే " అధ్యాయాల వసోర్ధార మంత్రాలను విధ్వాంసులచేత పారాయణ చేయిస్తూ ఈ యజ్ఞ కర్మ ద్వారా లోకానికి సమస్త సంపత్ సమృద్ధి కలగాలనే లోకొత్తర ప్రయోజనాన్ని కలిగించేందుకు సంకల్పిస్తూ శ్రీ స్వామీజీ సమిదాజ్య హోమాన్ని చేస్తారు.

సన్యాసులకు కర్మవర్జ్యము కదా మరి యతీశ్వరులకు హోమ ప్రక్రియ ఎలా సిద్ధిస్తుందనే సందేహము లోకంలో కొందరికి కలుగుతుంది. నిస్త్రైగుణ్యే పథి విచారతాం కో విధిః కో నిషేధః అని త్రిగుణాలకు అతీతంగా బ్రాహ్మీ స్థితిలో విరాజిల్లే అవధూతలకు సామాన్యవిధి నిషేధాలు పట్టవనే శాస్త్ర నిర్ణయం మనం అర్థం చేసుకోవాలి.

ఈ నవరాత్ర దీక్షలో స్వామీజీ వేషభూషలు చూసినవారికి కలిగే సంశయానికి సమాధానము కూడా ఇక్కడే ఉన్నది. వ్యక్తిగత ప్రయోజనాలను సాధించుకోవడానికి గృహస్థులు చేసే హోమాలకు ఈ నవరాత్ర దీక్షా హోమాలకు గల వ్యత్యాసము కూడా ఇదే. సాక్షాత్తుగా పరాశక్తిని తనలో ఉద్బుద్ధం చేస్తూ ఆ లక్షణలను సంతరించుకొంటూ విశ్వశ్రేయస్సు నిమిత్తంగా ప్రజలందరినీ సన్మార్గంలో నడిపించే అద్వితీయమైన ఫక్కీ ఇది. వాస్తవంగా ఈ అద్వైత స్థితిలో పూజ్య - పూజక - పూజా భేదాలనే త్రిపుటి ఉండదు. వీటినధిగమించి విశ్వవ్యాప్తంగా ప్రసరించిన అద్వితీయ చైతన్య భావన ఒకటే ఉంటుంది.

కానీ బహిరంగంగా మనలను తరింపజేసే కొన్ని సాధన మార్గాలను చూపించడానికై ఇటువంటి పూజా హోమ విధులను శ్రీ స్వామీజీ ఆవిష్కరిస్తూ విశ్వవ్యాప్త చైతన్య దర్శనమనే విశాలమైన దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలనే సందేశాన్ని మనకందించి అటువంటి సంకల్పాన్ని మనచేత కూడ చేయిస్తున్నారు.

ఇటువంటి ఉత్కృష్టమైన హోమ విధులవల్ల ప్రజలకు సౌఖ్యము సంపదలు పుణ్యలోకాలు లభించడమే గాక క్రమేణ చిత్త శుద్ధి క్రమశిక్షణ కలగాలనీ తద్వారా వారు ఆత్మ జ్ఞాన సంపన్నులు కావాలనే ఉదాత్తమైన ఆశయంతో శ్రీ స్వామీజీవారు ఈ హోమ విధానాన్ని అవలంబిస్తారు. ఆ భావం మనకు ఈ కీర్తన ద్వారా అందుతున్నది.

**ప్రచండ దండ చండికా (తిస్రగతి)**

ప్రచండ దండ చండికా సుధామ హవ్యవాడయాట్

ప్రఖండయే దఖండుతాఘ మీడితా మృడేశ్వరీ

శరద్యమోఘ దివ్యమాసి చాశ్వినేథ భక్తిమాన్

స్వగృహ్యసూత్ర చోది తాన - లం చసమ్ప్రయోజయన్

సమిఘృతే జుహోమితే భవాని మే ప్రసీదతాత్

ప్రపంచయాత్మ సౌఖ్య శాంతి మాదరాత్ పరాత్పరే ,

జగత్యనేకజీవినస్స్వసంచితైవ రైశ్చిరా

భవుష్యతీహ శాశ్వతీతి మూఢచేతసాసతే।

యథేయమాహుతిర్ భృశం సహోజసీవదహ్యతే

ప్రదహ్యతే తథారయిశ్చ కాలవహ్నికీలగా ॥2॥

జగద్వినశ్వరం క్షణా - దతోదయస్వమాతృకే

విరచ్య వహ్నిమండలే హి కోణషట్కమాయజై

మనుం చ షోడశార్ణకం నవార్ణ మంత్రముచ్చరన్

సిసేనిషామి వేదఘోష మాశృణుష్వ మంగళే ॥3॥

ఉమే సునిశ్చలాం మతిం త్వదీయ పాదపంకజే

ఇహాధిహీన జీవితం విరాగభావసంపదమ్

నిరామయం ప్రదేహి దీర్ఘమాయు రుత్తమం పదం

అయాని సర్వకామదం భజాని సచ్చితం సుఖమ్ ॥4॥

శరత్కాలే మహాపూజా క్రియతే యాచ వార్షికీ।

తస్యాం మమైత న్మాహాత్మ్యం శ్రుత్వా భక్తి సమన్వితః॥

సర్వబాధా వినిర్ముక్తో ధన ధాన్య సుతా(అ)న్వితః।

మనుష్యో మత్ప్రసాదేన భవిష్యతి న సంశయః॥

జానతాజానతా వాపి బలిపూజాం తథాకృతామ్,

ప్రతీక్షిష్యా మ్యహంప్రీత్యా వహ్నిహోమం తథా కృతమ్,

(మార్కండేయ పురాణాంతర్గతమైన చండ్సప్తశతిలీని శరత్కాలపూజా హోమవిధి)

శరత్కాలములో భక్తులు చేసే పూజా, హోమ విధులకై నేను ప్రేమతో ఎదురుచూస్తాను. వీటిని ఆచరించినవారికి అన్ని బాధలు దూరమై, ధన ధాన్య సంపదలు సిద్ధిస్తాయి - అని జగన్మాత అనుగ్రహించింది.

భావార్థము

పల్లవి: ప్రచండమైన (తీక్షణమైన) దండ విధానమును కలిగిన చండికాదేవియొక్క దివ్యధామమైన ఈ యజ్ఞేశ్వరుదు హోమవిధి చేత సేవించబడినాడు. ఆ అగ్నిలో నెలకొన్న ఆ పరాశక్తి (మాచేత) స్తుతింపబడినది. సుఖమును కలిగించే ఈశ్వరీదేవి (పరాశక్తి) పెద్ద బండరాయి వంటి మా పాపాల్ని ముక్కలు ముక్కలు చేయుగాక.

దండము అంటే కర్ర అని, శిక్ష అని పలు అర్థాలున్నాయి. కఠినమైన దండన ఆ చండికాదేవి మా పాపాలమీద ప్రయోగించాలనే స్తుతి ఈ హోమవిధి ద్వారా కోరుతున్నాను. ఎంత పెద్ద పపమైనా, చండీదేవి యొక్క దయవల్ల పటాపంచలు కావలసినదే. అందువల్ల పాప ఫలమైన దుఃఖము మాకు ఉండకూడదు అనే ప్రార్థన కూడా ఇందులో ఉన్నది.

***చరణం*** , ఓ భవానీదేవీ! అమోఘమైన అశ్వయుజ మాసంలో భక్తి తత్పరుడనై స్వగృహ్యా సూత్రములో చెప్పినట్లుగా అగ్నిముఖ ప్రయోగాన్ని నిర్వర్తిస్తూ, అన్నిటికంటే గొప్ప శక్తివైన నీ

కొరకు సమిధలు నెయ్యితో ఆహుతులను సమర్పిస్తున్నాను. నీవు ప్రసన్నురాలివై ఆదరంతో మా యందు ఆత్మానందాన్ని శాంతిని నీ ప్రసాదానికి సూచనగా విస్తరించు.

***చరణం*** ప్రపంచంలో అనేక మంది తాము చెసే డబ్బు సంపాదనే స్థిరంగా ఇక్కడే శాశ్వతంగా ఉండిపోతుందని మూఢ నమ్మకముతో ఉండిపోతూ విలువైన జీవితాన్ని వృథా చేసుకుంటున్నారు. వాస్తవంగా చూస్తే ఈ ఆహుతి అగ్నిలో పడి ఎలా దహనమౌతుందో అలాగే ఈ సంపాదనలన్నీ కాలమనే అగ్ని జ్వాలలో పడి భస్మమవుతాయి కదా!

***చరణం*** కాల స్వరూపమే నీవైన ఓ జగన్మాతా! ఈ ప్రపంచమంతా నీ రెప్పపాటు కాలంలో (క్షణకాలములో) వినాశన మయ్యేదే. (ఉన్మేష నిమిషోత్పన్న విపన్న భువనావళిః) అందువల్ల ఉపేక్ష చేయక సత్వరం నన్ను అనుగ్రహించు. ఈ హోమగుండంలోనే షట్కోణాన్ని రచించి షోడశాక్షరి నవార్ణాది మహా మంత్రములను ఉచ్చరిస్తూ కాలాగ్ని స్వరూపిణివైన నిన్ను సేవించదలుస్తున్నాను. ఈ హోమకాలంలో పఠించే వేదమంత్రాలను వినవమ్మా ఓ మంగళాదేవీ!.

***చరణం*** ప్రణవ స్వరూపిణివైన ఓ ఉమాదేవీ! నీ పాద పద్మములయందు నిశ్చలమైన బుద్ధిని ఇవ్వు. మనః క్లేశాలు లేని జీవితాన్ని ప్రసాదించు. వైరాగ్యమనే సంపదను రోగరహితమైన దీర్ఘాయుష్యాన్ని మంచివారితో సాంగత్యమున్న ఉత్తమ పదవిని నాకు ప్రసాదించు. ఇలా నీ అనుగ్రహమువల్ల అన్నికోరికలనూ ఏక కాలంలో పొందగలిగే నీ సచ్చిదానంద స్థితిని పొందుదును గాక!

---

**కర్తాక్రియాణాం సస ఇజ్యతే క్రతు-**

స్స ఏవ తత్కర్మఫలం చయచ్చ

స్రుగాది యత్ సాధన మప్యశేషం

హరేర్న కించిర్వ్యతిరిక్తమస్తి॥

కళా కాష్ఠాది రూపేణ పరిణామ ప్రదాయిని।

విశ్వస్యోపరతౌ శక్తే నారాయణి నమోస్తుతే॥

శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే।

సర్వస్యార్తిహరే దేవి నారాయణి నమోస్తుతే॥

విశ్వేశ్వరీ త్వం పరిపాసి విశ్వం

విశ్వాత్మికా ధారయసీహ విశ్వమ్।

విశ్వేశవంద్యా భవతీ ప్రసన్నా

విశ్వాశ్రయా యే త్వయి భక్తినమ్రాః॥

**7. క్షీరాభిషేక, అలంకార, అవధానసేవలు**

ఇక నవరాత్ర పూజా విధానంలో చివరి ఘట్టాలకు చేరుకో బోతున్నాము. నవావరణ పూజ, అన్నార్చన, హోమ విధుల తరువాత మళ్ళీ అమ్మవారికి క్షీరాభిషేకం చెయ్యడం ఒక అద్భుతమైన సందర్భం. ఎందుకంటే ప్రథమ ఆవరణమైన భూపురం నుండి, ఒక్కొక్క ఆవరణ

ఒక్కొక్క ప్రాకారం దాటి చివరిదైన బిందు స్థానంలో (9వ అవరణలో) పరాశక్తిని ఆరాధించడమే మకుటాయమానమైన ఘట్టం. ఈ స్థితిలో ఆచార్యుడు పరాశక్తి చైతన్యాన్ని పరిపూర్ణంగా అనుభవిస్తూ, తాదాత్మ్యం చెందుతూ, మనోలయమువల్ల అద్వైత స్థితిలో ఉంటాడు. అందువల్ల ఆ స్థితిలో జరిగే క్షీరాభిషేకం కూడా అత్యంత శుభప్రదమైనది. వాస్తవముగా ఆ స్థితిలో ఉన్న శ్రీస్వామీజీవారు దర్శనం సాధకులకు, భక్తులకు, శిష్యులకు సర్వార్థ సాధకమని చెప్పాలి.

అభ్యాస బలమువల్ల గురుదేవుల శరీరము, తన విధులను పూజా కైంకర్యాల రూపంగా చేసుకునిపోతున్నా, అంతఃకరణం మటుకు పరతత్త్వములో లీనమై ఉనట్లు, నిశితంగా పరిశీలించే సభాసదులకు స్పష్టంగా అర్థమవుతుంది.

ఆ సమయంలో జరిగే క్షీర అభిషేకము, అలంకరణ, అర్చనలు, మాంగల్యపూజ, సమర్పణలు, ముద్రారచనలు, నవనవోన్మేషంగా పుష్పాలనుండి వెలువడే రత్నాలతో శ్రీ చక్రానికి పూజ, మరొకవైపు శ్రీ మాతకు జరిగే వాగ్రూపమైన సేవలు - వీటి వైశిష్ట్య వైభవం అనుభవించాలి గాని పూర్ణంగా వివరించలేము.

నవరాత్రులలో అమ్మవారికి నిత్యం జరిగే పారాయణ సేవలు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదము, శరుద్రీయము, చండీ సప్తశతి, దేవీ భాగవతం, లలితోపాఖ్యానం, లలితా సహస్రనామము, లలితా త్రిశతి, దేవీ ఖడ్గమాల మొదలైన పవిత్ర గ్రంథాల పారాయణలు, లలితనామ స్మరణ పూర్వకంగా శ్రీ మాతృనామ లేఖనము, సంగీత వాద్య

సాహిత్య కవితా నిర్ఘోషలు దేవీతత్త్వ ప్రవచనములు దివ్య నామ సంకీర్తనలు - ఇటువంటివి ఉదయము నుండి రాత్రి వరకు ౯రోజులపాటు జరుగుతూనే ఉంటాయి.

అయితే ఈ సేవలు చేసే ఋత్విక్కులు విద్వాంసులు అందరూ నవావరణ అర్చన పూర్తి అయిన ఈ పతాక స్థాయిలో వారి వారి విద్యలతో అమ్మవారిని సేవించడం పరదేవతానుగ్రహాన్ని పొందే మహత్తర ప్రయత్నమని తెలుసుకోవాలి. ఇలా వాగ్దేవత అయిన ఆ పరాశక్తికి చేసే కైంకర్యాన్ని అష్టావధానసేవ అంటారు.

౮ విద్యా విశేషాలవైపు బుద్ధిని ఏకాగ్రముచేసి ఆ విద్యాప్రస్థానాలకు ఉద్గమం పరాశక్తి అని గ్రహించడమే అష్టావధాన సేవలోని అంతరార్థము. బ్రహ్మవిద్యా స్వరూపిణి అయిన శ్రీమాత దయవల్ల ఈ సేవను దర్శించిన వారికి సేవలందించిన వారికి విద్యా ప్రాప్తి కలగడమే ప్రయోజనము. ఈ విశేషాలను ౭వ కీర్తన మనకు తెలుపుతుంది.

ఐమేకపంచాశదుదారపీఠం

హ్రీమాది హక్షాంత మనోస్సవిత్రీమ్।

శ్రీంనౌమి శైవీంపరమాంసతీం క్లీం

సౌశ్శక్తి మష్టాదశపీఠనేత్రీమ్॥

సంస్నపయామి క్షీరేణ (చతురస్రగతి)

***పల్లవి*** సంస్నపయామి క్షీరేణ

ప్రావరయామి క్షౌమేణ

***అనుపల్లవి***హిమగిరితనుజాం గురుతమ కరుణాం

అపచిత కర్మభి రాసేవే

1. వికలుష ధిషణా సితపయ ఇవ మే

అఖిల జనగణే స్నిగ్ధత్వం

పశుపతి గృహిణీ ప్రదిశతు సతతం

కలికలుషమిదం సదాయాత్

2. కనకసు వసనా ప్రణిపతన విధౌ

ముదమను భవతో మేశీర్షం

కరపద యుగళీ మమ హృదయమిదం

తవ పరిచరణే వర్తంతాం

3. విఘ్నాధిప రవి కృష్ణేశ్వర యుత

పంచాయతన సు గేహస్థే

పీతైరరుణిమ గౌరైరథ సిత

నీలైర్ వసనై రుత్కృష్టైః

4. ఉద్యద్రవి నిభ గోమేధిలమణి

ముక్తామరకత వజ్రాఢ్యైః

గ్రైవేయకనకమాంగల్య కటక

మాణిక్యమకుట భూషాభిః

5. పవిత్రకరణై రలంకరిష్యే

సువాసినిముదా స్వీకుర్యాః

ఋచో యజూంషి శృణుష్వ సామా-

న్యథర్వమంత్రాన్ వేదాంతాన్

6. పురాణ శాస్త్రా ద్యపారవిద్యా

ప్రసంగసేవాస్తేవిదధే

విపంచికాద్యైస్సువేణునాదైర్

మృదంగ ఘోషై త్వాం సేవే

సర్వమంగళే త్రాహిసదా

సచిదానందే పాహిసదా

***పల్లవి***సంస్నపయామి క్షీరేణ ప్రావరయామి క్షౌమేణ

శ్రీచక్రప్రియబిందుతర్పణపరాం శ్రీ రాజరాజేశ్వరీమ్

**భావార్థము**

***పల్లవి:*** హిమవంతుడి కుమార్తే కరుణామూర్తి అయిన జగన్మాతను పూజాది కైంకర్యములతో సేవిస్తున్నాను. క్షీరంతో అభిషేకము చేస్తూ పట్టు వస్త్రాలతో అలంకరిస్తున్నాను.

***చరణం*** ₁ ఈ క్షీరాభిషేకము వల్ల తెల్లని పాలవలె నా బుద్ధికూడా నిర్మలంగా ఉండుగాక. కలియుగంలో కలిగే దోషాలను జగన్మాత తొలిగించి ప్రజలందరిపట్ల స్నేహభావాన్ని మాకు దయచేయుగాక!

***చరణం*** ₂ బంగారు వస్త్రాలను ధరించే జగన్మాతకు నమస్కరించడంలోనే ఆనందమును అనుభవిస్తున్న నా యొక్క శిరస్సు హృదయము కాళ్ళు చేతులు మొదలైన అవయవాలు ఎల్లప్పుడూ ఆ సేవలోనే ఉండుగాక!

***చరణం*** ₃,₄ విఘ్నేశ్వరుడు సూర్యుడు కృష్ణుడు శివుడితో కూడిన పంచాయతనమనే చక్కని మండపంలో వెలుగొందే పరాశక్తి! పవిత్రమైనటువంటి పసుపు ఎరుపు తెలుపు నీలము రంగుల ఉత్తమ వస్త్రాలతోనూ ఉదయించే సూర్యుని పోలే గోమేధికము మణిమాణిక్యాలను ముత్యము మరకతము వజ్రాలు పొదిగినటువంటి కంఠహారము బంగారు మాంగల్యం గాజులు మాణిక్య ఖచితమైన కిరీటములతోనూ నేను అలంకరిస్తున్నాను. పెద్ద ముత్తైదురూపం దాల్చిన ఓ సువాసినీ! స్వీకరించు.

***చరణం*** – ఋగ్వేద మంత్రాలను యజుర్వేద మంత్రాలను సామవేద మంత్రాలను అథర్వణ మంత్రాలను వేదాంత వాక్యాలను పురాణము శాస్త్రము మొదలైన అనేక విద్యాప్రసంగాలతో నీకు సేవలు సమర్పిస్తున్నాను. వీటితోపాటుగా వీణ వేణు మృదంగము గానము మొదలైన కైంకర్యాన్ని నీకు సమర్పిస్తున్నాను.

ఓ సచ్చిదానంద స్వరూపిణి అందరికీ సుఖాన్ని కలిగించే సర్వమంగళా మమ్ములను రక్షించు.

త్వాం గౌరిం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్రసంచారిణీమ్

**నీరాజనాది కైంకర్యములు**

నీరాజనమంటే చక్కని ప్రకాశము. మన సంప్రదాయములోని దేవాలయాలలో పూజా మండపాలలో జరిగే ప్రార్థనలలోనూ అర్చనలలోనూ నీరాజనానికి చాలా ప్రాముఖ్యమున్నది. దీనిని ఆరతి అర్తి అని కూడా అంటూ ఉంటారు. ఈ పేర్లలోనే ఒక సందేశము కూడా లభిస్తుంది.

చక్కటి ప్రకాశానికి మనం వినియోగంచేసే పదార్థాలు కర్పూరము నెయ్యి వత్తి నూనె వత్తులు ఇవన్నీ కూడా ప్రకాశాన్నిస్తూ ఇతర వస్తువులను ప్రకాశింపచేస్తూ చివరకు ఆ ప్రకాశంలో అవికూడా కలిసిపోతాయి. అంటే ఆ కాంతినిచ్చే జ్వాలలో లయమై పోతాయి.

అదే విధంగా భగవంతుడి ప్రతిబింబమైన జీవులందరూ జీవించినంతవరకు తాము వెలుగొందుతూ పదిమందికి వెలుగునిస్తూ ఆ వెలుగులోనే చివరిదశలో లీనమైపోతారనీ ఇదే జీవన ఆదర్శ జీవన విధానమని మనకు బోధపడుతుంది.

అంతేగాక దీపమున్నప్పుడే ఇల్లు చక్కపెట్టుకోవాలి అనే సామెత ప్రకారంగా నీరాజనపు వెలుగున్నప్పుడే కర్తవ్యం నెరవేర్చుకోవాలనీ) అంటే ఆయుర్దాయము ఉండి జ్ఞానేంద్రియాలు కర్మేంద్రియాలు సక్రమముగా పని చేస్తున్నప్పుడే భగవత్ దర్శనానికీ సజ్జన సాంగత్యానికీ కృషిచేయాలనే సందేశము అంతర్లీనంగా నీరాజన విధివల్ల మనకు అందుతోంది.

కర్పూర నీరాజనాన్ని అర్తి అనే పిలవడం ఉత్తర దేశంలో వాడుకలో ఉంది. అర్తి అంటే కష్టము. ఇక్కడ విశేషమేమిటంటే భగవంతుడి దర్శనము దేవతామూర్తి రూపంలో చక్కగా లభిస్తే కర్పూరం కరిగిపోయినట్లుగా మన కష్టంకూడా కరిగిపోతుందని అందువల్లే ఆర్తికి(కష్టం) సంకేతంగా మండిపోయే కర్పూర నీరాజనానికి కూడ ఆర్తి అనే పేరు వచ్చింది.

ఇక ఆరతి అనేపదాన్ని విచారిద్దాం (ఆసమంతం రతిః) అంటే పూర్ణమైన ఇష్టం. భగవంతుడి దర్శనం నీరాజనపు వెలుగులో అద్భుతంగా కలుగుతుందనీ ఆ తేజోమయ దర్శనంవైపు మక్కువ పెరగాలనీ అటువంటి మక్కువకు సాధనమైన నీరాజన విధిని ఆరతి అనే పిలిచే పద్ధతి లోకంలో ప్రారంభమైనది.

విద్యుత్ దీపాల వ్యవస్థ లేని ఆలయాలలో దీపాల కాంతిలోనే భగవంతుడిని దర్శించే సంప్రదాయము ఉన్నది. ఎన్ని దీపాలు వెలిగించి దేవతామూర్తికి దర్శనానికి వెలుగును ఏర్పరిచినా నిరాజన విధిలో వినియోగించే కర్పూరపు వెలుగులో మరియు ఒకటి రెండు మూడు నాలుగు ఐదు ఆరు పదకొండు పదహారు ఇరవై ఏడు ఇలా వివిధ సంఖ్యలలో వినియోగించే నేతి వత్తుల వెలుగులో దేవతామూర్తియొక్క అంగాంగ వైభవము పాదము నుండి కిరీటము వరకు మనోహరంగా దర్శనమవుతుంది. ఇలా దేవరామూర్తిలోని ఒక్కొక్క

భాగము ఒక్కొక్క అవయవము ఒక్కొక్క ఆయుధము లేక ఒక్కొక్క ఆభరణము కన్నుల పండువగా మనకు దర్శనమవడానికి వీలు కల్పిస్తున్నందువల్లే నీరాజన విధికి అంతటి ప్రాధాన్యం మన సంప్రదాయంలో కల్పించారు.

మంత్రపుష్పము నీరాజనము తరువాత సమర్పించే ఉపచారాన్ని మంత్రపుష్పమని అంటారు. మంత్రోచ్చరణ పూర్వకంగా మన హృదయమనే పుష్పాన్ని భగవంతుడికి సమర్పించడమే దీనిలోని అంతరార్థం. అహింస సత్యము ఋతము దానము దయ ధర్మము మొదలైన సద్గుణలే దేవుడుకి ప్రీతిపాత్రమైన పుష్పాలు. ఇటువంటి సద్గుణాలన్నీ దైవానుగ్రహంవల్ల మకు లభించాయి లభిస్తున్నాయి లభిస్తాయు మరియు ఎప్పుడూ లభించాలనే ప్రార్థనతో ఆ సద్గుణాల సంకేతముగా పూలను సంపూర్ణంగా సుందర్ తేజోమయరూప దర్శనం అయిన తరువాత సమర్పిస్తాం. ఇదే మత్రపుష్ప విధి.

వాస్తవంగా చెప్పాలంటే షోడశ ఉపచారాలలో నీరాజనమంత్ర పుష్పాలు ప్రత్యేకంగా చెప్పబడలేదు (దీపంలోనూ ప్రార్థనలోనూ ఇవి అంతర్భాగాలే). అయితే లఘుపూజా పద్ధతులలో నామార్చన ధూపము నైవేద్యము నీరాజన మంత్రపుష్పాలు పంచోపచారాలుగా భక్తుల సౌకర్యార్థం లోకంలో వాడుకలోనికి వచ్చాయి.

ప్రార్థన తరువాత తనివి తీరక ఆయా దేవతామూర్తి రూపాన్ని బట్టి మరికొన్ని సేవలను భక్తుడి సామర్థ్యానికి తగినంతలో సమర్పించే ఆనవాయితీ ఉన్నది. వీటినే రాజోపచారాలు (రాజుకి అనువైన ఉపచారాలు) దేవోపచారాలు (దేవుడికి అనురూపమైన సేవలు) శక్తి

ఉపచారాలు (తన శక్తిమేరకు చేసే సపర్యలు). భక్త్యుపచారాలు (తన భక్తి కొద్దీ జరుపుకొనే కైంకర్యాలు) అని పిలుస్తారు.

ఈ నవరాత్రి పూజా విధానంలో శ్రీ మహారాజ్ఞిగా అమ్మవారిని కొలుస్తున్నాము. కాబట్టి ఆ జగన్మాతకు రాజలాంఛనాలైన ఛత్రము (గొడుగు), వ్యజనము, విసినకర్ర, ధ్వజము, జెండా, బాణము మరియు దర్పణము (అద్దము) అనే సామాగ్రిని ఉపచారంగా సమర్పించి ఇంకా తనివి తీరని మరోసారి ఉత్తర నీరాజనపు వెలుగులో అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించు కొంటాము.

ఆ తరువాత అనేక దేవతామూర్తులు పరివార దేవతలు తమ తమ వాహనాలద్వారా ఈ మండపంలో వేంచేసి, జగన్మాతను కొలుస్తున్నారు అనే భావనతో, ఆ చిహ్నాలు కలిగిన నీరాజనపు వెలుగులలో అమ్మవారిని సంతోషంగా దర్శించుకునే పద్ధతి ఈ నవరాత్ర పూజలో ప్రత్యేకంగా ఉన్నది.

ఎంతచేసినా ప్రతి పూజకు ఒక ముగింపు రావలసినదే. ప్రతి జీవికి అవసానదశలో జీవి చైతన్యము పరచైతన్యములో కలసిపోవాలి. అంతఃకరణమనే (మనస్సుఅనే) ఉపాధి లయమైపోతే ప్రతిబింబము బింబములో కలిసిపోతుంది. ఇదే జీవన్ముక్తి లేక మోక్షము. దీనికి తార్కాణంగా ఒకే దీపాన్ని మనయొక్క జీవచైతన్య దీపంగా శ్రీమాతకు సమర్పించి, నా ఈ ప్రాణదీపం నీదే కదా! అనేమనవితోపాటుగా, మనము ఆ పరాశక్తిలోని అంతర్భాగమే అనే స్ఫూర్తిని కలగచేసేదే నందా దీపం.

నందము అంటే అహేతుకమైన సహజ సంతోషం. ఏదయితే సత్యమో అదే ప్రకాశము. ఆ ప్రకాశమే ఈ దీపపు వెలుగు. ఈ వెలుగే ఆనందానికి సంకేతము. అదే సచ్చిదానందము. ఈ సచ్చిదానందమే జీవనపరమార్థము. ఇటువంటి అంతరార్థాన్ని మనకు అందించే ఈ కీర్తనను పరిశీలిద్దాం.

---

కన్యాభిః కమనీయ కాంతిభిరలం స్వశ్రీభిరారార్తికం

పాత్రే మౌక్తిక చిత్రపంక్తి విలసత్కర్పూర దీపాళిభిః।

తత్తత్తాళ మృదంగ గీతసహితం నృత్యత్పదాంభోరుహమ్

మంత్రారాధన పూర్వకం సువిహితం నీరాజనం గృహ్యతామ్॥

**నీరాజన దీపార్చిషి (తిస్రగతి)**

***పల్లవి*** నీరాజన దీపార్చిషి వీక్షేమహి దేవీం।

లోకత్రయ రక్షైక సు దీక్షామిహ దేవీమ్॥

1. దేవా అపి యక్షా ఋషి వర్యాస్త్వయి భక్త్యా

ఆరార్తిక సేవామిహ వాంఛంతిహి దిష్ట్యా।

ఏకైకశ ఉద్యద్రవి తేజస్సమ దీపైః

సంకాశయమానాః ప్రవిలీనా స్తవ భాసే॥

2. అంభోజసు కన్యాయుత కేకీ భసు దీపైః

మూషగరుడేశానడు దర్వధ్ఘట కాశైః।

నందాభిధ నీరాజన కాంత్యా(అ)ర్బుదదీప్తిం

శ్రీమాతృసుమూర్తిం మమ భాగ్యాదవ లోకే॥

3. అద్రీశసు పుత్రిత్రిజ గద్రాజ సు పత్ని

ఛత్రం వ్యజ నంతే ధ్వజ బాణావవ లోక్య।

ఆదర్శమపీక్షస్వచ సమ్రాజ్ఞిసు వేణి

సంకాశయగేహాని చసంపత్తిభిరీశే॥

4. శుద్ధం ఘృత వర్తిచ్ఛవి దీప్రం తవ వక్త్రం

సంధ్యారుణ వర్ణం శివభాగ్యం ప్రస విత్రి।

పూర్ణంతవ సంవిన్మయ భాసా మమ శీర్షం

లీయైపరదీప్తా వథ సచ్చిదానందే॥

## భావార్థము

***పల్లవి*** నీరాజన దీపాల కాంతిలో జగన్మాతను దర్శిద్దాం ముల్లోకాలను రక్షించడమే దీక్షగా గలిగిన ఆ పరదేవతను దర్శిద్దాం.

***చరణం*** 1 ఓ జగన్మాతా! దేవతలు, యక్షులు, మునిశ్రేష్ఠులు అందరూ నీయందు భక్తితో నీ నీరాజన సేవను కోరుతున్నారు కదా! భాగ్యవశాన ఆ సేవ లభించగా, ఉదయ సూర్యకాంతితో సమానమైన అరుణ వర్ణపు దీపాలతో, ఒకటొకటిగా నీ తేజోమూర్తిని (ప్రకాశింపజేస్తూ) తిలకిస్తూ, నీ వెలుగులలో లీనమైపోతున్నారు.

***చరణం*** 2 నేను కూడా కమలం, కన్య, మయూరము, గజము చిహ్నంగా ఉన్న వెలుగులతోనూ, మూషక, గరుడ, నంది,అశ్వము, కలశముల కాంతులతోనూ, నందాదీప కాంతులు మొదలైన కోటికాంతులు గల శ్రీమాత యొక్క దివ్యమంగళ విగ్రహాన్ని నా భాగ్యవశాన దర్శిస్తున్నాను.

***చరణం*** 3 ఓ ఈశ్వరీ! నీవు పర్వతరాజు కుమార్తెవు. ముల్లోకాలు పాలించే అధిపతికి పట్టమహిషివి. అందువల్ల రాజలాంఛనాలైన ఛత్రము, వ్యజనము, ధ్వజము, బాణాలను తిలకించి, అద్దములో నీయొక్క ముఖ సౌందర్యాన్ని చూపవమ్మా మహారాజ్ఞీ! చక్కని కురులు కలిగిన పరమేశ్వరీ! మా గృహాలన్నీ సంపదలతో ప్రకాశింపచేయవమ్మా!

***చరణం*** 4 నీ యొక్క ముఖము నేతి వత్తుల కాంతితో వెలిగి పోతున్నది. సంధ్యా సమయపు అరుణవర్ణపు కాంతులీనుతున్నది. శ్రీమాతా! నిజంగా ఈ ముఖసౌందర్యం,నీ పతి జగదీశ్వరుడైన సదాశివుడి భాగ్యమే కదమ్మా! నీ జ్ఞానాత్మకమైన కాంతిచేత నా మది నిండినది. ఇక నీ సచ్చిదానంద శుద్ధ చైతన్య తేజస్సులో లీనమైపోదునా.

ఇటువంటి దివ్య దర్శనం కలిగిన తరువాత లోకంలో సాధకుడు చేయవలసినదేదీలేదు. పొందదగినది అంతకంటే లేదు. శుద్ధచైతన్య ప్రకాశంలో లీనమవడమే ఈ దీక్షకు చరమ లక్ష్యం అనే భావన ప్రస్ఫుటమవుతోంది.

హ్రీంకారాసన గర్భితానలశిఖాం సౌఃక్లీం కళాం బిభ్రతీం

సౌవర్ణాంబరధారిణీం వరసుధాధౌతాంత్రినేత్రోజ్జ్వలామ్।

వందే పుస్తకపాశమంకుశధరాం స్రగ్భూషితాముజ్జ్వలాం

త్వాం గౌరీంత్రిపురాంపరాత్పరకళాం శ్రీ చక్రసంచారిణీమ్॥

**డోలోత్సవము**

భక్తి పలు రకాలు. పరాశక్తిని జగన్మాతగా ఆరాధించడం ఒక విధం. జగత్తుకే అధినేత్రిగా భావించి సేవించడం మరొక రకం. బాలా రూపంలో ముద్దులొలికే పసిపాపగా వాత్సల్య భావనతో ప్రేమపూర్వకంగా పరిచర్యలు చెయ్యడం ఒక విధం. నిరంతరం ప్రపంచములోని జీవరాశులను రక్షిస్తూ పాలిస్తూ సంతోషపెడుతూ సన్మార్గములో పెడుతూ పిల్లలను కంటికి రెప్పవలె చూసుకొనే ముగురమ్మల మూలపుటమ్మకు కొద్దిపాటి విశ్రాంతి కూడా అవసరము కదా!

అందుకని ఊగిసలాడే నా మనస్సే నీ ఉయ్యాల కానీ అని భక్తుడు ఆప్యాయంగా అమ్మను ప్రార్థిస్తాడు. ఇంతవరకూ నా భక్తి పారవశ్యంలో ఆ ఉపచారాలనీ ఈ సపర్యలనీ అనేక

రకాలుగా నిన్ను శ్రమ పెట్టానమ్మా! ఆ శ్రమను తగ్గించేందుకు నా యీ ఉయ్యాల సేవ ఉపకరించుగాక! అని నిష్కపటంగా నిష్కమంగా శ్రీమాతకు ఒనర్చే సేవ డోలోత్సవము.

వేదాంత పరంగా పరికిస్తే మనస్సు పనిచేస్తే (మనస్సుయొక్క ప్రజ్ఞ బాగుంటే) శరీరమనీ బంధువులనీ ఇల్లనీ వాకిలనీ ఊరనీ దేశమనీ వ్యవహారాలు బయలుదేరతాయి. ఆ మనస్సు ఎప్పుడైతే స్తంభించి పోతుందో అప్పుడు అన్ని వ్యవహారాలు స్తంభించిపోతాయి. యోగ సాధనకు ధ్యాన తాదాత్మ్య స్థితికి మనోకయమే సిసలైన లక్ష్యం.

మనస్సు ప్రవర్తిస్తే ఇంద్రియాలు ప్రవర్తిస్తాయి. మనస్సు నివృత్తి చెందితే ఇంద్రియాలు కూడా పయించిపోతాయి. మరి ఈ మనస్సు యొక్క ప్రవృత్తి నివృత్తులను నియంత్రించే శక్తులెవరు? ఆశక్తికి మన మనస్సుకుగల సంబంధమేమిటి? అనే అంతరార్థన్ని ఈ ,వ కీర్తనద్వారా తెలుసుకొందాం.

## దేవి డోలా (మిశ్రగతి)

***పల్లవి***దేవి డోలా దుర్గి డోలా గౌరి డోలా కాళి జో

జోజో .................. జయ జో ............... జో

***చరణం***1 తే ఝంపా ప్రవృత్తౌ చేత్ తే స్తుతిం దిశ మే

తేతు ఝంపా నివృత్తౌ యదిసంహరాక్షాణీహ మే

2 తే లీలా విసృష్టిశ్చేత్ మేస్తు సత్ప్రతిభా

సంహృతిం యదిలీలయేచ్ఛసి చిత్తవృత్తిం మే హర

3 దేవి యా దివి శంకరాంకే సంగతాసాత్వం

ఏధి మే హృది భావనామయ డోలికాయాంసంగతా

4 ధీమధ్యే సదాసింహీ మధ్యమావతి యా

సర్వదా మాంసర్వదాపిచ సచ్చిదానందావతు

***పల్లవి*** దేవి డోలా దుర్గి డోలా గౌరి డోలా కాళి జో

జోజో .................. జయ జో .............. జో

—

**భావార్థము**

***పల్లవి*** లీలగా డోలపై ఊగవమ్మా ఓ దుర్గాదేవీ! (డోల అంటే ఉయ్యాల). ఉయ్యాల ఊపుని ఝుంపా (జంప) అంటారు. (ఉయ్యాల జంపాల అనే నానుడి ఇందువల్లే వచ్చింది). ఉయ్యాలపై అమ్మవారు మందగతిలో ఊగుతుంటే అటో ఊపు ఇటో ఊపు మన మనస్సుని సమ్మోహితం చేస్తూ అనంద పారవశ్యంలో ముంచెత్తుతాయి. మన మనస్సుయొక్క ప్రవృత్తి నివృత్తులకు పరాశక్తి (మాయాశక్తి) సంకల్ప వికల్పాలే కారణం.

లీలగా బ్రహ్మాండాలను సృష్టించి ఉపసంహరించే జగన్మాత యొక్క మాయాజాలమే ఈ సంకల్ప వికల్పాలు.

***చరణం*** , జగన్మాతా! ఈ ఊపు ప్రవర్తకమై నా మనస్సును ప్రవృత్తి ధర్మములోకి మళ్ళిస్తే నా నోట నా మనసున నీ స్తోత్రమే వచ్చేటట్లుగా చెయ్యి. పుట్టినది లయము కావలసినదే కనుక నీ ఊపు నివృత్తివైపు వస్తే నా యొక్క ఇంద్రియాలను మనస్సునూ ఉపసంహరించి నీలో లయము చేసుకో (మనస్సు బుద్ధి) సక్రమముగా పనిచేస్తునప్పుడు పరాశక్తిని సేవిస్తే ఆ సాధకుడికి అమ్మ దయవల్ల మనోలయమనే సమాధి స్థితి లంభించి జీవన్ముక్తు డవుతాడనే సారాంశం).

***చరణం*** , అమ్మా! బ్రహ్మాండాలను ఉత్పత్తి చేయడం నీ లీల అయినప్పుడు నాకు నిత్య సత్యమైన పరంబ్రహ్మ తత్త్వానుభవం కలుగుగాక! ఒకవేళ (కల్పాంతంలో) మహా సంహారమే నీ ప్రణాళికయితే నా చిత్తవృత్తిని హరించివేసి పునరావృత్తిరహితమైన నీ శాశ్వత స్థితిలో అవకాశమియ్యి.

***చరణం*** , శంకరుడి ఒడిలో కులుకుతూ రమించే ఓ పార్వతీ! ఊగిసలాడే న భావనలనే ఊయలలో కూడా నివే కదా ఉన్నది.

శక్తిలేనిదే శివుడు కూడా కదలలేడు అనే స్తుతిలో ఒక చక్కని అంతరార్థము ఉన్నది. స్వగత పరగత భేదం లేని అఖండ సచ్చిదానంద స్వరూపమయిన నిర్గుణ బ్రహ్మము సగుణ బ్రహ్మగా సంస్థాన భేదం కలగాలంటే మాయా శక్తే హేతువు. ఈ మాయశక్తి సాంగత్యము లేనటువంటి శివుడు బండలాగ మొద్దులాగ (స్థాణువు) నిశ్చలంగా నిర్వికారంగా నిరాధారంగా నిర్గుణంగా. నిష్కలంగా నిష్క్రియంగా నిరతిశయా నంద స్థితిలో ఉండిపోతాడు.

అవిద్య విలాసం వల్ల ఇచ్ఛా శక్తి జ్ఞానశక్తి క్రియా శక్తుల సంసర్గమువల్ల సగుణ బ్రహ్మ మొదలుకొని అవ్యక్తం మహత్తు అంతఃకరణము మొదలైన భౌతిక సృష్టులన్నీ అవిర్భవిస్తున్నాయి. కాబట్టి శక్తి ఉంటేనే శివుడిలో కదలిక ఉంటుంది. శక్తికి స్వతంత్రరూపము ఉండదు. అది జీవుడిలో ఉండి కార్యనిర్వాహము చేస్తుంది. ఇదే శక్తి విలాసం.

దీనికే కవితా సౌందర్యం కోసం శివుడి సాంగత్యములో విలసిల్లే పరాశక్తి అని సంబోధించారు. ఆ శక్తి విలాసంవల్లే నేను జీవుడిని అనే ప్రజ్ఞ సంభవించి నాలో అనుకూల ప్రతికూల సుఖ దుఃఖ ప్రవృత్తి నివృత్తి భావనలు కలుగుతున్నాయి. పరాశక్తియొక్క చైతన్య విలాసం న భావనలలో బాగా వర్ధిల్లితే ఊగిసలాట అగిపోయి మళ్ళీ మూలమైన నిశ్చల తత్త్వ స్థితికి దోహదపడుతుంది. అందువల్ల నా బుద్ధిని ప్రేరేపించే పరాశక్తిని మరింత అధికంగా తన ప్రభావాన్ని పెంచమని ప్రార్థిస్తున్నారు.

***చరణం*** .సివంగి నడుమువంటి ఉత్తమమైన కటి భాగం కలిగిన ఆ సచ్చిదానంద స్వరూపిణీ! నా బుద్ధియందుండి ఎల్లప్పుడూ అవసరమైనవి ఇస్తూ నన్ను రక్షించుగాక!

**వివరణ** సివంగి ప్రసక్తిలోని అంతరార్థమేమిటంటే సింహి (సివంగి) అంటే ఆడ సింహం. సింహ పదం హింస అనే పదం నుండి వ్యుత్క్రమంవల్ల ఉత్పన్నమైంది. నా బుద్ధిలో నెలకొన్న దేవిని హింసకు చిహ్నమైన సింహంతో పోల్చడం కాస్త ఎబెట్టుగా అనిపిస్తుంది కాని వాస్తవ స్థితిని గమనిస్తే - మనస్సు ఇంద్రియాలు చిరకాల సాంగత్యమువల్ల విషయ వాసనలను మరిగి ఉంటాయి.

ఈ విషయవాసనలలో మునిగిన వారితో ఒక ప్రమాదమున్నది. ఆ విషయాలు తుచ్ఛమని చెప్పినా వాటియందు రుచిమరగడంవల్ల కోపగించి పోట్లాడతారు. ఇటువంటి ఆసురీ ప్రవృత్తిలో ఉన్నవారిని మరల్చడం చాలా కష్టం. ఒక రకమైన ఒత్తిడి లేక దెబ్బ అదీ కుదరకపోతే సంహారము ఒకటే వీరిని సన్మార్గంలో పెట్టడానికి పనికొచ్చే ఉపాయాలు. అందువల్ల విషయవాసనా ప్రవృత్తులైన రాక్షసులను అసుర ప్రవృత్తిగలవారని శిక్షించి రక్షించే ఘట్టాలు అమ్మవారి చరిత్రలో కోకొల్లలుగా ఉన్నాయి.

నిపుణుడైన వైద్యుడు రోగదష్టమైన శరీర భాగాన్ని తొలగిస్తేగానీ మిగిలిన శరీరం క్షేమంగా ఉండదని నిర్ణయించి వ్యాధిగ్రస్తమైన అవయవాన్ని తీసివేస్తాడు. అలాగే సృష్టిలో ఆసురీ శక్తులు ప్రబలినప్పుడు వారి ప్రవృత్తులను నియంత్రించే పరాశక్తి వారిని శిక్షించి రక్షిస్తుంది. ఆ రూపం కాస్త భయంకరంగా కూడా కనిపిస్తుంది. గోళ్ళు తీయడానికి తల్లి ప్రయత్నిస్తున్నప్పుడు అనుభవంలేని పిల్లవాడు భయపడిపోతాడు. అలాగే వైద్యుడు సూదిమందు తీసుకొస్తుంటే లేక శస్త్ర చికిత్స చేయబోతుంటే తెలియనివారే గాక తెలిసినవారు కూడా కాస్త భయపడతారు. కటువైనది హితమైన విషయాన్నీ వస్తువునూ - మనస్సు ఒక పట్టాన అంగీకరించదు కదా!

అందువల్ల మన బుద్ధియందుండి అందులోని కల్మషాలను తొలగించే సివంగి - అనే వర్ణనలో ఔచిత్యమున్నది. ఎల్లప్పుడు అవసరమైనవి ఇచ్చే ఆ మహా తల్లి పాప ప్రవృతినుండి నన్ను రక్షించు గాక!

ఇదే పరమార్థం వైపు నడిపించే ప్రార్థన. పాప ప్రవృత్తి లేకనే నిష్కామ కర్మలను ఆచరిస్తూ ప్రారబ్ద కర్మలను క్షయం చేసుకొంటే సద్గురువుయొక్క తత్త్వోపదేశం అనుభవంగా మారుతుంది. అదే జీవన్ముక్తి అనేపరమార్థం. అదే ఈ నవరాత్ర పూజా విధానానికి పర్యవసానం.

ఆ దివ్య స్థితి అమ్మ దయవల్ల మనకు కలుగుగాక!

**శ్రీమాత్రే నమః**

**జయ గురు దత్త**

ఓం సర్వమంగళమాంగల్యే శివే సర్వార్థసాధికే।

శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమో(అ)స్తుతే॥

ఓం సర్వస్వరూపే సర్వేశే సర్వశక్తిసమన్వితే।

భయేభ్య స్త్రాహి నో దేవి దుర్గే దేవి నమో(అ)స్తుతే॥

ఓం సర్వబాధా ప్రశమనం త్రైలోక్య స్యాఖిలేశ్వరి।

ఏవమేవ త్వయా కార్య మస్మద్వైరి వినాశనమ్॥

ఓం దుర్గే స్మృతా హరసి భీతి మశేషజంతోః

స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి।

దారిద్ర్యదుఃఖ భయహారిణి కా త్వదన్యా

సర్వోపకార కరణాయ సదా(అ)ర్ద్ర చిత్తా

# విజయదశమీ కలశోద్వాసన, శమీపూజ, రథోత్సవం - సీమోల్లంఘనం

తొమ్మిది రోజులుగా భక్తి ప్రేమ. ఆదరంతో జగదంబను కొలచుకున్నాము. మహదానందంగా జరిగిన నవరాత్రోత్సవం పూర్తి కావస్తోంది. అప్పుడే అయిపోతోందా అనే బాధ ఒకపక్క, శ్రీమాత సన్నిధి మళ్లీ ఎప్పుడు దొరుకుతుందో అనే బెంగ మరోవైపు, దివ్యంగా ఉత్సవం సంపూర్ణమవుతోందనే తృప్తి ఒకపక్క, ఇన్ని రోజుల పాటు అమ్మ సన్నిధిలో లభించిన ఆనందం, ఇంకోవైపు - ఇలా అన్ని భావనల కలగలుపుగా విజయదశమి కార్యక్రమం ప్రారంభమవుతోంది.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఘట్టాలు

**నవకలశ ఉద్వాసన**

కలశోద్వాసన అంటే తొమ్మిది కలశములలో ఆవాహన చేసిన దేవతలను వారి వారి స్థానాలకు సాగనంపడం. ఉద్వాసన అయిన తరువాత ఆ కలశాలలోని పవిత్ర జలాలతో మూల సంపుటానికి అభిషేకం చేస్తారు. ఈ సమయంలో పఠించే మంత్రాల ద్వారా - వసువులు, రుద్రులు, ఆదిత్యులు, విశ్వేదేవులు, బృహస్పతి, అశ్వినీ దేవతలు, సూర్యుడు, సవితా,

పూషా ఇంద్రుడు వరుణుడు మొదలైన సురులందరూ వచ్చి మన ఆరాధ్య దేవతా మూర్తిలో (మూలసంపుటంలో) చైతన్యన్ని పరిపూర్ణంగా నింపుతారనే భావం ఉంది.

**అంకుర సమర్పణం**

అంకురం అంటే మొలక. కలశాల కింద ఉన్న ధాన్యాలన్నీ తొమ్మిదిరోజులలో మొలకెత్తి సస్య సమృద్ధిని సూచిస్తాయి. ఆ మొలకలను (అంకురాలను) మొదట అమ్మవారికి సమర్పించి దైవప్రసాదంగా భావిస్తూ ఆశ్రమంలోనూ ఇతర క్షేత్రాలలోనూ (పొలాలలోనూ) ఆ మొలకలను నాటుతారు.

అమ్మవారి సన్నిధిలో మొలకెత్తిన ఉపాసనా భక్తి బీజం కూడ ఈ మొలకలాగే పెరిగి మన మనస్సులను పరిపుష్టం చేయాలనే దానికి అంతరార్థం.

**శమీ పూజ**

శమీ అంటే జమ్మి చెట్టు అని ఒక అర్థం. శమింపజేసేది తగ్గించేది అని రెండవ అర్థం. శ్రౌత యజ్ఞకర్మలలో అగ్న్యాధానంలోనూ అగ్నిమథనానికి ఈ శమీ వృక్షం చాలా ప్రశస్తమైనది. ఈ శమీ కాండాన్ని అగ్ని యొక్క యజ్ఞియ శరీరమని వేదం వ్యాఖ్యానించింది. ఇక ఈ శమీవృక్షం శనీశ్వరుడికి కూడా ప్రియమైన వృక్షం.

ఈ శమీవృక్షం అర్జునుడు మొదలైన పాండవుల అయుధాలను ధరించిందనీ దుర్గా స్వరూపమనీ మహాభారతంలో విరాటపర్వంలో పేర్కొన్నారు. అజ్ఞాతవాసం భంగం చేయడానికి కౌరవులు ఉత్తర గోగ్రహణం అనే పన్నాగం పన్నారు. ఒకవైపు ఆశ్రయమిచ్చిన

మహారాజుకు జరుగుతున్న అవమానము మరోవైపు తమ ప్రతిజ్ఞా భంగం మళ్ళీ అరణ్యవాసం - ఇలా సందిగ్ధ పరిస్థితివల్ల కర్తవ్యం పాలుపోని స్థితిలో ఉన్న అర్జునుడు దుర్గా దేవిని ధ్యానించి శమీ పూజ చేసాడు. అంతకు పూర్వం త్రేతాయుగంలో కూడా శ్రీరామచంద్రుడు యుద్ధానికి వేళ్లే సమయంలో శమీ రూపంగా దుర్గను ఆరాధించి శుభ సూచనలు పొందినట్లుగా కూడా రామాయణంలో ఉల్లేఖించారు. ఈ విధంగా శమీ పూజవల్ల శత్రు నాశనం శుభసూచన పురాణ పురుషులకే కలిగాయి కాబట్టి తొమ్మిది రోజుల నవరాత్రి తర్వాత పదవరోజున శమీపూజ చేసే సంప్రదాయం లోకంలో ఉన్నది.

శ్లో - శమయతే పాపం శమీ వినాశిని।

అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శిని॥

**రథోత్సవం**

శమీపూజ తరువాత అమ్మవారియొక్క రథోత్సవ యాత్ర ప్రారంభం అవుతుంది. స్యందనం అంటే రథము. అమ్మవారి అనుగ్రహం పొంది రథాన్ని అధిరోహించి జైత్ర యాత్రకు వెళ్లడం మహారాజులకు పరిపాటి. ఇలా దశమినాడు ప్రారంభించిన జైత్రయాత్ర విజయాన్ని చేకూరిస్తుంది కాబట్టి విజయదశమీ అని పేరు వచ్చింది.

విజయుడు అనేది అర్జునుడికి మరోపేరు. అర్జునుడు ఉత్తర గోగ్రహణ ముద్ధంలో విజయం పొందిన దశమి కాబట్టి కూడా విజయదశమి అనే పేరువచ్చింది. అందువల్లే కొత్త వ్యవహారాలు వ్యాపారాలు కొనుగోళ్ళు చేసేవారంతా ఈ రోజే నూతన కార్యాలు ప్రారంభిస్తారు. విద్యార్ధులకు కూడా ఈ రోజ్యే శుభప్రదమైనది.

మూలేనా వాహయేద్దేవీం శ్రవణేన విసర్జయేత్

మూల నక్షత్రం నాడు సరస్వతీ దేవిని పుస్తక రూపంలో ఆవాహన చేసిన విద్యార్థులు మూడు రోజుల పాటు పూజించి నాల్గవ రోజైన దశమి నాడు శ్రవణ నక్షత్రంలో ఉద్వాసన చేసి తమ తమ విద్యాభ్యాసాన్ని పునఃప్రారంభిస్తారు.

ఇలా అన్ని రకాల కార్యసాధనలకు ప్రశస్తమైన విజయదశమి నాడు అమ్మవారిని పూజించిన తరువాత ఆచార్యుడు తదితర గృహస్థులు యజమానులు అందరూ నవరాత్ర వ్రతాన్ని ఉద్యాపన చేస్తారు.

అంతవరకూ వ్రతంలో ఉన్నందువల్ల నివాససీమను దాటకూడదు. సీమ అంటే పొలిమేర హద్దు. నియమాన్ని కొంత సడలించినా గ్రామ సీమను మాత్రం దాటకూడదు. కలశోద్వాసన పూర్తయ్యాక వ్రతసమాప్తికి సూచకంగా దీక్షలో ఉన్నవారంతా సీమోల్లంఘనం చేస్తారు. అంటే సీమను దాటతారు.

ఇక పైన వారి వారి కార్యలు ప్రారంభించ దలచిన వ్యవహారాలు నిరాటంకంగా సాధించడమే విజయదశమీ పూజలోని అంతర్యము.

ఈ భావాన్ని పదవకీర్తన ద్వారా తెలుసుకుందాం.

**పల్లవి** జేమానం తంతనీతి సువిజయదశమీ

**పూజాభిరాధితా...... సుమాహితలలితా**

**చరణం** క్షత్ర రక్ష దీక్షితా క్షమేక్షణా(అ)క్షరం

క్షంజతాంసమాం క్షమాం క్షపాం క్షిణోతు మే।

క్షేత్ర మక్షుధం కురు క్షర క్షతం క్షణాత్

క్షాంతి మక్ష పాటవం చ దక్ష దక్షిణే॥

2 రాఘవా (అ)ర్జునాది భూమి పాలకా శ్శమీ

రూపిణీం ప్రపూజ్యపల్లవాదిభిః పురా

జిగ్యు రాహవే తు జైత్ర భక్త రక్షయా

ఆశు జిత్వరా భవేయు రీష దీక్షితాః॥

3 పాప నాశినీ చ వైరి తర్జ్వికా (అ)వతాత్

నవసు రాత్రి ఘూత్క టం ప్రసేవి తేశ్వరీ

స్యందనోత్సవేన సీమ లంఘనేన మాం

సచ్చిదా..... నంద తాం ప్రణాయయేదుమా॥

**భావార్థం**

చక్కటి విజయదశమీ పూజలచేత ఆరాధింపబడిన శ్రీలలితా రాజరాజేశ్వరీ భక్తులకు విజయాన్ని కలగజేస్తున్నది.

**చరణం** ఆ పరదేవతను ఈ విధంగాకోరుకుంటున్నాను.

1 దేశము క్షేమంగా ఉండాలంటే ప్రభుత్వం సక్రమంగా పనిచేయాలి. అంటే ప్రభుత్వంలోని అందరు పాత్రధారులు వారి వారి కర్తవ్యాలను నిజాయితీగా నిర్వహించాలి. ఇలా కర్తవ్య నిష్ఠతో కూడిన పరిపాలననే క్షేత్రం (గవర్నెన్స్). ఈ పరిపాలన దక్షతను కాపాడుతూ జగన్మాత లోకానికి క్షేమం కలిగించుగాక.

2 ప్రజలు,పాలకులు,భక్తులు చేసిన తప్పులను క్షమ్దృష్టితో మన్నించుగక.

3 చక్కటి విద్యనూ మరియూ దీటైన క్షమాగుణాన్ని ప్రసాదించుగాక.

4 నా అజ్ఞానమును నాశనం చేయుగాక

5 నా యొక్క క్షేత్రములో ఆకలి లేకుండుగాక. క్షేత్రం అంటే శరీరము,భూమి, పొలము,దేశము. వీటిలో ఆకలిబాధ ఉండకూడదు.

6 క్షత్రం అంటే హాని, ప్రమాదము. నా వ్యవహారంలోనూ, సాధనలోనూ మరియు నాఆస్తులు,నా బంధుమిత్రుల విషయంలోనూ క్షతి లేకుండుగాక.

7 నా యొక్క ఇంద్రియములు సమర్థంగా పనిచేయాలి. ఈ విధముగా దక్షులలో (సమర్థులలో) దాక్షిణ్యం కలిగిన జగన్మాత ప్రసాదించుగాక.

**చరణం** 2 శ్రీరాముడు,అర్జునుడు మొదలైన రాజులందరూ శమీరూపిణి అయిన ఆ శ్రీమాతను చిగురుటాకులతోనూ, పూలతోనూ అర్చించి, యుద్ధంలో విజయం పొందారు. అమ్మవారిని పూజించి జైత్రయాత్రకు బయలుదేరిన

భక్తులను రక్షించేటటువంటి ఆ జగన్మాత కొనగంటి చూపు పడితేనే చాలు. శీఘ్రంగా విజయం ప్రాప్తిస్తుంది.

**చరణం**: శమీరూపంతో ఉండే జగన్మాత ఈ నవరాత్రులలో నాచేత శ్రద్ధగా సేవించబడినది. నా యొక్క పాపములను తుంచేసి, అంతశ్శత్రువులనూ (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనూ) మరియు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నాకు అపకారం తలపెట్టే బహిశ్శత్రువులను పరిహరించి, నన్ను ప్రణవ రూపిణి అయిన ఉమాదేవి రక్షించుగాక.

## రథోత్సవం - సీమోల్లంఘనం

సీమోల్లంఘనం అంటే పొలిమేర దాటడం అని చెప్పుకున్నాం. ఈ అంతరార్థం పరిశీలిస్తే ఈ సన్నివేశంలో హద్దు అంటే గ్రామ సీమ అనీ, ఇంటి హద్దు అనీ కాదు. ఇంతవరకూ పూజ్యా (అంటే పూజింపబడేది), పూజక (అంటే పూజించేవాడు), పూజ (అంటే సేవ) అనే మూడుపుటలు ఉన్నాయి. అదే త్రిపుటి ఈ భేదమే సీమ.

వాస్తవంగా బ్రహ్మాత్మైక్య స్థితిలో వున్న జ్ఞానికి తాను, ఇతరులు అనే భేదమే వుండదు. ఇదే సిసలైన సచ్చిదానందమనే అత్మానుభవం. ఎవరైతే ఈ అనుభవం వల్ల పూర్ణులవుతారో వారికి పూజ్య-పూజక భేదమే ఉండదు.

అంటే పూజ్యుడు వేరే, పూజ స్వీకరించేవారు వేరే, పూజచేసేవారు వేరే అనే హద్దు ఉండదు. ఈ స్థితి కావాలనేదే అమ్మవారిని కోరాల్సిన కోరిక. ఆ స్థితికోసం నేను చేసే రథోత్సవం ఉపకరించాలి.

చలనస్వాభావం గల నా మనస్సే రథం. పూజ్య పూజక భేదమే సరిహద్దు లేక సీమ. నా మనోరథాన్ని శ్రీమాత అధిరోహించి త్రిపుటి అనే హద్దును (సీమను) దాటాలి. ఈ విధంగా సీమోల్లంఘనం వల్ల మనస్సు లయమై ఈ నవరాత్ర పూజాఫలంగా నాకు సచ్చిదానంద ప్రాప్తిని కలుగజేయుగాక.

**జయ గురు దత్త**

**సమర్పణమ్**

గత 24 సంవత్సరాలపాటు అనేక సందర్భాలలో శ్రీ స్వామీజీవారు అందించిన సూచనలు భావాలు ముద్రలు చర్యలు క్రియలు గమనించిన మాకు అర్థమైన రీతిలో యథాశక్తిగా ఈ నవరాత్రి కార్యక్రమ పరిచయం సంకలనం చేశాము.

గుణదోషౌ బుధో గృహ్ణన్నిందుక్ష్వేడావివేశ్వరః।

శిరసా శ్లాఘతే పూర్వం పరం కంఠే నియచ్ఛతి॥

అనే న్యాయాన్ని అనుసరించి బుధజనులు దోషాలను మన్నించగలరు. ఈ అవకాశం ప్రసాదించిన మా సద్గురుదేవులు శ్రీస్వామీజీవారికి మా విద్యా గురువులందరికీ సవినయ ప్రణామాలు సమర్పిస్తున్నాము.

పరిచారక వర్గము పూజావేదిక

త్వదీయం వస్తు తుభ్యమేవ సమర్పయే

ఏతత్ ఫలం సర్వం శ్రీ గురు చరణావిందార్పణామస్తు।

**ఫలస్తుతిః**

ఓం

కల్యాణీం పరమేశ్వరస్య కరుణాం యస్సంస్మరేత్ సర్వదా

ఏధేతైష నవస్వహస్సు నియమైరారాధయేత్ శ్రద్ధయా

ఓక్షిత్రీ భవితా(అ)శ్రితేషు జననీ ప్రేమాదరాలంబనా

లక్ష్యాస్యాత్ పరదేవతాచ్ఛమతిభిస్సంవిన్మయే మానసే॥ ౧

హ్రీం నిద్రా స్మృతి బుద్ధి జాతి కరుణా మాత్రాది రూపైశ్చయా

హర్షశాదిభిరీశ్వరీ చితి ఘృణా శాంత్యాది భావై రపి।

సర్వే జీవిని వర్తమాన సుషమా స్వే సత్యధామ్నీమకం

కళ్యాణత్మని లాతు మాం భగవతీ మా వృత్తి హీనే ధ్రువమ్॥ ౨

హంసస్సోహమయం త్వసౌచ సకలోప్యాత్మేతి విద్యా యయా

లవ్యం భావి హి రజ్జుసర్ప మత ము చ్ఛేదా దవిద్యాతరోః

హ్రీంకారస్య జపం కురుష్వ యది తే తత్త్వోదయేచ్ఛా తతః

సత్యం జ్ఞాన మవాప్స్యసీహ నిగమామానం ప్రసిద్ధం శృణు।

కల్యా సత్త్వ గుణాశ్రితోత్తమ ధియే యా కాళికా తామసీ

లక్ష్మీ రాశ్రయణీయతాం భజతి మే త్వర్థాప్తయే రాజసీ

హ్రీంబీజా(అ)క్షర తత్త్వమాప్తు మచిరం వాక్ సాత్వికీ శ్రీయతే

ఓం కుర్యాదథ మా ముమా త్రిగుణకా శ్రీ సచ్చిదానందనే॥

## అనుబంధము

## అవధూత దత్తపీఠాధిపతి జగద్గురు పరమపూజ్య

## శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారు

**భాగ్యనగరం (హైదరాబాదులో)**

**సర్వధారి సంవత్సర శరన్నవరాత్రి మహోత్సవాలు**

**(30 సెప్టెంబర్, 10 అక్టోబర్)**

**నిర్వహించిన సందర్భంగా విరచితమైన**

# స్తోత్ర ప్రవచనాలు

**అష్టకమ్**

1. ఇంద్రాది సుబృన్దారక బృంధై రభి వంద్యా

మందస్మిత సౌందర్య జితేందు ద్యుతి రంబా

సంవిందద మందాఖిల నందోదయ కందా

సంధ్యాస్వనుసంధా ముదబంధం కురు సంధ్యే

2. సాంధ్యా రుణ వర్ణ భ్రమరాంబా విదమంద్రా

తంద్రోన మతంద్రా కురుమైంద్రీప్సిత మిందా

ఉదంతు ఇందీస్సృత సంభందన సాంద్రాః

విందేమహి సుధానాం భవతంద్రా స్సితధారాః

3. సాంధ్య భ్రు మమ భ్రూయుగ మధ్యస్థ సుభద్రే

ముద్రారచనేన ద్రుత ముద్ద్రావిత నిద్రే

క్షుద్రోరు దరిద్రాస్త్వదను గ్రాహి దృగగ్రైః

భద్రా రజతాద్రీశ్వర భద్రే భవ భద్రా

4. బ్రహ్మాండ కరండస్య సవిత్రీ ప్రసవిత్రీ

భండాది కుచండాసుర ఖండావన శౌండా

చండ స్ఫురదుదండ రుడాకుండన దండా

మండోడుప చాముండి గుడాస్మాన్ ఛివపండా॥

5. కల్పాదిక కాలే కిల విష్ణౌ సతి సుప్తే

తన్నాభి సముత్థం విధి మత్తుం మధు దైత్యే

భ్రాత్రా సమ ముద్యుక్త ఇహస్రష్టరి ఖిన్నే

కాళీ నిజమాయాముపసంహృత్య సమావీత్।

6. వైధాత్ర వరోన్మత్త బలే వై మహిషే పి

రక్షస్య మరానర్దిత వత్యాహవ ఆరాత్

యుద్ధచ్ఛల ముక్తిం దదతీ త్వం మహిషఘ్నీ

సంరక్షణ కామా పరిమారక్షి త్రయి దేవి

7. లేఖ వ్యసనో న్మూలిని భూయోపి నిశుంభే

శుంభే జగదైశ్వర్య పదం ప్రాప్య చ గర్వాత్

దౌష్ట్యేన జగద్బాధిత వత్యుత్కట మీశే

సంమోహ్యా సుమాయే సమహార్షీ స్సురగుప్తే॥

8 త్రాణేసి నిమిత్తా భువనస్యైవ సమర్థా

రుద్రేణ సుమేషా వభిదగ్ధే భసితోత్థం

నైరాశ్య జవుద్విడ్ధృతజీవాఖ్య రసంతం

భండం సమతౌథ్సీర్ జగదుజ్జీవన కామే॥

**ఫలశ్రుతిః**

సర్వాంతర్వర్తినీం విద్వాం సచ్చిదానంద భాస్వతీమ్।

స పఠ్యాదష్టకం విద్వాన్ యోవిజ్ఞాంసమభీప్సతి॥

**శ్రీ సరస్వతీ విద్యా ప్రార్థనమ్**

ఛందోమయీా మహ్యా మావిర్భవ

స్వచ్ఛంద మానందనం దీపయ

సంవిన్మయీా భాసి సంధాయినీ

బోభోషి మే సచ్చిదానందినీ

1 ఋగ్భి ర్యజుర్భి స్సదా సామభీ

రారాజసే థర్వ మంత్రైర్యుతా

బేరం చకాస్తి ప్రభా మండితం

వేదాంత సిద్ధాంత ఘన భాస్వరం

2. ఘ్రాణం చ శిక్షా భవే దంబికే

ఆస్యం చ తే వ్యాకృతి శ్శోభతే

చక్షూంషి తే జ్యౌతిషం కల్పతే

శ్రోత్రం నిరుక్తం చ కల్పః కరౌ

3. పాదౌ హి ఛందో గిరాం దేవతే

సాంగాసి సాహిత్య భూషాదినా

విద్యే సరస్వత్యమోఘాం కృపాం

సాంగ శ్రుతే మాత రాధేహి మే

**దుర్గీ లక్ష్మీ దేవీ**

(10 మాత్రలు మత్యతాళం కాపీ రాగం)

**పల్లవి**. దుర్గీ లక్ష్మీ దేవీ, సావిత్రీ గౌరీ వాణీ మాతా, మాం పాతు

1. మస్కర నాద వినోదే, హేదేవి.............

శక్తిర సీమక జీవిషు, సంభాసి............

2 మస్క్రరి వర్యా రాధిత భద్రపదా

సద్గురు వర్యా సాదిత కల్పలతా.........

3 సద్గుణ వర్షిణి దుర్గుణ మాహంసి

సచ్చిదానందం శాంభవి తంతంసి...........

**భావార్థం**

**పల్లవి** దుర్గా లక్ష్మీసరస్వతీగౌరీ రీపముతో ఉన్న శ్రీమాత నన్ను రక్షించుగాక.

**చరణం** 1 వేణు నాదమనే వినోదము కలిగిన ప్రకాశవంతమైన ఓ లక్ష్మీదేవీ! నా యొక్క శక్తి నీవేగదా! ఈ జీవులందరిలో సృష్టిలో అంతటా నీవే ప్రకాశిస్తున్నావు.

2 యతీశ్వరులైన శ్రీశంకరాచార్యుల వారిచే ఆరాధించబడిన శుభప్రదమైన పాదముల మహాలక్ష్మీ దేవి నీవు. ఈనాడు సద్గురువులవల్ల కల్పలతవలె మాకు సన్నిహితంగా ఉన్నావు.

3 ఇలా మాకు సన్నిహితమైన ఓ దుర్గీలక్ష్మీ! మా దుర్గుణములను హరించి సద్గుణములను వర్షిస్తున్నావు.

ఓ శాంభవీ! మాలో సచ్చిదానందమును విస్తరింపజేస్తున్నావు.

**సామోపానీయా దామనితా**

**సింధుబైరవి రాగం త్రిపుట తాళం**

**పల్లవి**

**సామోపానీయా దామనితా శ్రీలలితా**

**సామోపానేయా సా మహితా సామ హితా**

**కాశీనాథసతీ సన్నిహితా సద్గణితా**

1. **శాలా చా వరణం తద్రహితా న క్షేయా**

**ఖ్యాతా సా హి విశా..లాక్షీమే సం భద్రా**

2. **గంగాస్మానఫలం భక్తియుతే సా మఠరే**

**కాశీవాస ముదం సంమననా దాకలయేత్**

3. **మీయేథా దురితం ప్రారబ్ధం సన్నిచితం**

**నాథస్వానుచరం హే మాయే దితపాపే**

4. **దేవీ దేవనుతా సర్వగతా సంపృణుయాత్**

**సచ్చిదానన్దో మే సర్వహితే స్ఫాయేత**

**భావార్థం**

***పల్లవి***

శ్రీ లలితా దేవి కాశీనగరంలో విశ్వేశ్వరుడి పట్టమహిషి విశాలాక్షిగా విరాజిల్లుతోంది. శ్రావ్యమైన సామవేదం ఆవిడకు హితమైనది. నా చేత అవిడ స్మరింపబడుచున్నది అర్చింపబడినది. సామవేద మంత్రములచేతనే సన్నిహితమయ్యే ఆ మహాతల్లి సత్పురుషుల చేత గౌరవింపబడుతున్నది. ఆవిడ సాన్నిధ్యాన్ని ప్రసాదించి అక్కున చేర్చుకోవాలి.

**చరణం** 1

విశాలాక్షీ అంటే వెడల్పైన నేత్రాలు కలదని అర్థం. కానీ ఈ నామంలో ఓ విశేషం ఉంది.శాల అంటే ఆవరణము. మాయ ఆవరణం అని కూడ అర్థం. ఇటువంటి మాయా ఆవరణం లేని శక్తే విశాలా. క్షీ అంటే నాశమయ్యేది. అక్షీ అంటే నాశనము లేనిది. కాబట్టి మాయావరణం లేని అనంత శక్తే విశాలాక్షి అని విశేషమైన అర్థం. ఆ విశాలాక్షి నాకు శ్రేయస్సును కలగజేయాలి.

**చరణం** 2

మఠర అంటే మూఢుడు గోత్రము (వంశము) జ్ఞాని అని 3 అర్థాలు. అటువంటి వారికైనా ఆ విశాలాక్షీ దేవిని స్మరిస్తే చాలు. వారికి గంగాస్నాన ఫలమూ కాశీవాసంలోని ఆనందమూ లభిస్తాయి.

**చరణం** 3

పాపాలను ఖండించే ఓ మాయా శక్తి! నా యొక్క సంచిత ప్రారబ్ధ కర్మలను పాపాలనూ నాశనం చేయమ్మా! నీ అనుచరుడినైన నన్ను అనుగ్రహించు.

**చరణం** ₄

దేవతలచేత కూడ కీర్తింపబడే ఆ సర్వాత్మిక విశాలాక్షీ దేవి నాకు ప్రసన్న మగుగాక! అందరికీ హితం కలగజేసే ఆ శక్తి వల్ల నాలో సచ్చిదానందం వర్ధిల్లుగాక!

**మీ న నయనా**

**పల్లవి** మీ - న నయనా మా - న ధనికా

మై - న సోవే న్మా నుతా

₁ మేనా తనయా మీనాం కమతా

ఉన్నీయ మనో రన్వయం

మానో న మిమం మానా సుహితం

మనో న్నతయే నేనిజ్యాత్

₂ న్యూనా నమనే నున్నాః కుజనాః

నుధ్యం సుజనా నూనం తత్

నానో నిధనం నీయా న్నితరాం

సచ్చిదానందా న్నిగదం తత్

**భావార్థం**

**పల్లవి** మీనులవంటి కన్నులగల మీనాక్షీదేవి. అత్యంత గౌరవము (గొప్పదనము) గలది. లక్ష్మీదేవిచేత స్తుతింపబడినది. ఆ మహాతల్లి నన్ను పాపములనుండి రక్షించుగాక.

1. ఈవిడ హిమవంతుడు. మేనా దేవి కుమార్తె. మన్మథుడిచేత స్తుతించ బడినది. ప్రామాణ్య బుద్ధిలేని మానవులందరునీ ప్రామాణికులుగా ఉద్ధరించి. వారికి గౌరవం పెరిగేట్లుగా శుద్ధము చేయుగాక.

2. ఆశ్రీమాతపట్ల గౌరవభావములేక నమస్కరించని దుష్టులందరూ నశించారు. కాబట్టి సజ్జనులారా! మీరంతా అమ్మను స్తుతించండి.

ఇలా స్తుతించిన నరుడు మృతిని పొందడు. అంటే జరా మరణ చక్రమునుండి విముక్తుడై సచ్చిదానంద స్థితి వల్ల అమృతత్వాన్ని పొందుతాడు. ఇది వేదవాక్యం.

---

**సాదరా సరస్వతీ**

**పల్లవి**

సాదరా సరస్వతీ గిరాం దేవతా.

బ్రహ్మాణీ భామతీ(2)

1.వారో హానం నవా క్షేత్రే దాహో రణే

భూయాదా వేశితా స్యా

మేమతిం నిత్యే ధీదేవతే

2 ఐం బీజావాసినీ సద్విద్యా దాయినీ

సర్వాధారాసి దేవీ

దేశికా సచ్చిదానందినీ (2)

**అవతారిక**

సరస్వతీ దేవిని ఈనాడు స్తుతిస్తున్నాము. సరస్వతీ అనే పదంలో గొప్ప అర్థాలున్నాయి.

సరః అంటే కొలను సరస్సు. అనగా నీరు. నీరు జ్ఞానమునకు చిహ్నము. కాబట్టి సరస్వతీ అంటే జ్ఞానవతి అని అర్థం. వేదంలో సరస్వాన్ అనే పుంలింగ సంబోధన కూడ ఉంది. అది బ్రహ్మకు సంబంధించిన పదమని తెలుసుకోవాలి.

ఇక అమావాస్య అంటే సరస్వతి అని పూర్ణామాస అంటే బ్రహ్మ అని మరో నిర్వచనం ఔపానువాక్య గ్రంథంలో కనబడుతుంది.

(మంత్రం) అమావాస్య వై సరస్వతీ. అమావాస్య అంటే ఏమిటో తెలుసు కుందాం. అమా అనేది అవ్యయం. కలసి ఉన్నది అని అర్థం. సూర్యచంద్రులు కలిసి ఉంటారు కాబట్టి అమావాస్య అనే పేరు వచ్చింది. ఇక అమావాస్య పదానికి సరస్వతీ అనే అర్థం పరిశీలిద్దాం. వాక్కు అయిన సరస్వతి అర్థం అనే బ్రహ్మతో కలసి ఉంటుంది కాబట్టి వాగర్థ స్వరూపమే సరస్వతి అని భావం.

సరస్వతి అనే పదానికి సరస్వతీ నది అనే అర్థం కూడ ఉన్నది. ఈనాటి కీర్తనలో సరస్వత్యభి నో నేషి అనే మంత్రం యొక్క అర్థం చేరి ఉంది. ఈ భావాన్ని పరిశీలిస్తే ఈనాటి యుద్దానికి కారణాలు యుద్ధనివారణకు ఉపాయాలు బోధపడతాయి.

## కీర్తన భావార్థం

ఓ సరస్వతీ దేవీ నీటి వల్ల మా పొలాలు పాడు కాకూడదు. మా బుద్ధిలో ప్రవేశించి అరణ క్షేత్రాలకు ప్రమాదకరమైన స్థలాలకు వెళ్ళకుండా క్షేమంగా ఉండాలి - అని వాచ్యార్థం. నీటిచేత హాని అంటే అతువృష్టి వరదలవల్ల హాని. మరో అర్థం నీటికి హాని అంటే అనావృష్టి అని అర్థం.

ఇక్కడ అరణ క్షేత్రం అనే పదం ఉంది. అరణం అంటే యుద్ధం కానప్పటికీ అటువంటి ప్రమాదకరమైన సన్నివేశం అని భావం. ఈ మంత్రంలో పయసామాన ఆధక్ అన్నారు. ప్రవహించే నీటివల్ల కాలిపోకూడదు అన్నారు. నీటి వల్ల ఏదీ కాలదు కాబట్టి ఈ మంత్రంలో చెప్పిన కాల్చే నీరు అంటే చమురు (క్రూడ్ ఆయిల్) అని అర్థం.

అలాగే ఆనాటి సరస్వతీ నదీ పరీవాహక ప్రదేశాలలో అంటే నేటి గుజరాత్ మహారాష్ట్ర ప్రాంతంలో చమురు క్షేత్రాలు (అయిల్ ఫీల్డ్) ఉన్నాయనే సూచన కూడ లభిస్తుంది. చమురువల్లా నీటి వల్లా యుద్ధాలు కాకూడదనే ప్రార్థన కూడ ఇందులో ఉన్నది. ఇతరుల అస్తులవైపు దురాశ లేకుండా మా బుద్ధిలో సరస్వతీ ఆవాహించుగాక అనే భావం కూడ ఉన్నది.

ఈరోజు ప్రపంచంలో యుద్ధానికీ ఘర్షణకూ సామాన్య కారణాలు నీరు లేక చమురు. ఉన్నవాళ్ళు ఇంకా కావాలనీ లేనివాళ్ళు కొంతైనా కావాలనీ పోట్లాడుకుంటున్నారు. సరస్వతీదేవి కృపవల్ల నాయకులకూ వ్యాపార సంస్థలకూ సద్బుద్ధి కలిగి లోభం తగ్గాలి.

ఆ సచ్చిదానంద స్వరూపిణి మన బుద్ధిలో ప్రవేశించగా యుద్ధాలు జరిగే సన్నివేశానికి మేము దూరంగా ఉండాలి. సరస్వతీ అనే జ్ఞాన సరస్సులో మన బుద్ధి అనే చిన్న కుండ నిండుగాక!

నాదే(అ)వ్యక్తాక్షరాం దేవీం వేదే వ్యక్తాక్షరాం పరామ్।

ఓంకారపూర్వ ఐంకారే సాకారం నౌమి శారదామ్॥

**విజయవాటీ కనకదుర్గా**

**పల్లవి**

విజయవాటీ కనకదుర్గా మాతృమూర్తే వందనం

**అనుపల్లవి**

అష్టమీ జేగీయమానా వందనం జయలక్ష్మి తే

**చరణం**

అగ్నివర్ణా కర్మజుష్టా ఉజ్జ్వలోషో రశ్మిభా

చంచురీకం మానసం మే సుతర సిత్వం స్థాపయ

2. శైలపుత్రీ బ్రహ్మచర్యా చంద్రఘంటా దేవతా

తురీయాకూష్మాండ దుర్గా స్కందమాతా కీర్తితా

3. పూజితా కాత్యాయనీ సా కాళరాత్రీ సన్నుతా

మహాగౌరీ సిద్ధిదాత్రీ నవవిధా దుర్గాంబికా

4. సచ్చిదానందేన మాం సేచయేమం పుత్రకం

వందనం జయలక్ష్మితే మాతృమూర్తే వందనం

**అవతారిక**

లోకమంతా ఈ రోజు దుర్గాదేవిని పూజిస్తున్నారు. దుర్గాపూజ అంటే వంగదేశం, బెంగాల్ గుర్తుకు వసుంది. ఇక ఆంధ్రులకు మన బెజవాడ కనకదుర్గమ్మ తల్లి జ్ఞాపకం వస్తుంది. దత్త భక్తులకైతే పరమగురువు జయలక్ష్మీ మాత గుర్తుకొస్తుంది. మనం జయలక్ష్మీమాత జన్మోత్సవాన్ని జరుపుకుంటున్నాము.

ఆ సంతోషంలో, మనకు జయము, లక్ష్మీ (సంపద) పంచిపెట్టే దుర్గాంబిక తత్త్వాన్ని కొద్దిగా, తెలుసుకుందాం. దుర్గా అంటే తపస్సు అనే కష్టమువల్లే లభించే శక్తి అని సామాన్యార్థం.

ఈ శక్తి తత్త్వం మనకు అద్భుతంగా ప్రతిపాదించే మంత్రం తామగ్నివర్ణాం......... ఈ మంత్రాన్ని మనం నిత్యం అమ్మవారిని హోమం, స్తోత్రం, పూజ మొదలైన సేవలలో వింటూనే

ఉంటాం. కానీ దానిలోని అంతరార్థాన్ని నవదుర్గా నామాలతో సహా ఈనాటి కీర్తనలో తెలుసుకుందాం.

**కీర్తన భావార్థం**

**పల్లవి** దుర్గాష్టమీ పూజలో విజయం చేస్తున్న దుర్గాదేవి విజయవాడలో కనక దుర్గా అనే పేరుతో విరాజిల్లుతోంది. మాకు జయాన్నీ లక్ష్మిని (శోభను) ఇచ్చే మహాతల్లీ ఓ దుర్గాదేవీ! నీకు నమస్కారం.

**చరణం** , అగ్ని యొక్క రంగులో ప్రకాశిస్తున్న ఆ దుర్గా దేవి అన్ని కర్మలకు అధిష్ఠాత్రిగా ఉంటున్నది. అంతేగాక శక్తిరూపంగా అన్ని జీవులలోనూ ఉంటున్నదై సకల కర్మఫలాలను అనుభవిస్తున్నది.

తపస్సు చేత ఉజ్జ్వలమైన కాంతి కలిగియున్నది. ఆ ప్రకాశం ఉషోదయ కాంతువలె రమ్యంగా ఉన్నది. అత్యంతవేగం గలుగిన ఆ దుర్గమ్మ అతి చంచలమైన నా మనస్సు యొక్క గతిని నిలువుగాక.

ఇక్కడ సుతరసీ ఉషోరశ్మిభా ఉజ్జ్వలా అనే పదాలు అద్భుతమైన అర్థాన్ని తెలుపుతున్నాయి ఈ పదాలు శక్తి కాంతి యొక్క వేగం ప్రకాశంయొక్క పరిమాణం అనే అర్థన్ని తెలుపుతున్నాయి.

శబ్దం వేగంకంటే కాంతి వేగం ఎక్కువని మనకు తెలుసు. అందుకే ఆకాశంలో మెరుపులు కనిపించిన కొంతసేపటికి ఉరుముల ధ్వని వినబడుతుంది.

భక్తిపరంగా చూస్తే మనయొక్క ప్రార్థన ధ్వని నోటినుండి వెలువడగానే కాంతిలాగా మెరుపులాగా అతివేగంగా మమ్ములను ఆదుకోవాలి అని భావం.

లౌకిక వైజ్ఞానిక పరంగా పరిశీలిస్తే ఈ మంత్రం కాంతి వేగాన్ని కిరణాల సంఖ్యను గురించి మనకు బోధిస్తున్నది. ఉషన్ పదానికి ఉన్న అర్థలు రెండు - సూర్యోదయానికి ముందటి సమయం. అంటే అరుణోదయం అనీ ఆకాశం ఎరుపురంగులో ఉన్న సమయం అని అర్థం. అటువంటి కాంతి అని ఒక అర్థం.

ఒక ఉషన్ అనే పదానికే పదిలక్షల కోట్లు అని మరో అర్థం. శక్తి అన్ని కిరణాల కాంతి గలది అని భావం. అంత సంఖ్య ఊరికే ఉజ్జాయింపుగా చెబుతున్నారేమో అనుకొకూడదు.

వేదంలో అశ్వమేధ ప్రకరణంలో సంఖ్యా శాస్త్రానికి సంబంధించిన విస్తారమైన ప్రస్తావనలు ఉన్నాయి. అధునిక గణిత శాస్త్రం (మేథమెటిక్స్) మాతృక ఇక్కడే ఉంది.

ఈ రోజు బిలియన్ లేక ట్రిలియన్ అందే పెద్ద సంఖ్య అని అనుకుంటాం. కానీ వేదంలో ఇంతకు లక్షరెట్ల సంఖ్యల గురించి ప్రస్తావనలు ఉన్నాయి. అగ్నిచయన యజ్ఞంలో ఇష్టకోపధానంలోనూ పరార్థం అనే సంఖ్యగురించీ అశ్వమేధంలో అంతకు మించిన పై సంఖ్యల గురించీ స్పష్టంగా ప్రతిపాదితమైనది. ఖగోళ విజ్ఞానంలో మన భారతీయుల పరిశోధనకు కూడ చక్కటి నిదర్శనాలున్నాయి. ప్రపంచమంతా శూన్యం లేక విందువు అంటే సున్నా భారతీయుల బహుమతి అని పొగుడుతూనే ఉంటుంది. మనగణిత విధానం ప్రకారంగా ఏకం - ఒకటి దశ - పది శతం - వంద. సహస్రం - వెయ్యి అయుతం - పదివేలు నియుతం - లక్ష ప్రయుతం - పది లక్షలు లేక మిలియన్ అర్బుదం - కోటి న్యర్బుదం - పది

కోట్లు సముద్రం - వందకోట్లు లేక బిలియన్ మధ్యం - వెయ్యి కోట్లు లేక పది బిలియన్ అన్తం - పదివేల కోట్లు లేక 100 బిలియన్ పరార్థం - లక్ష కోట్లు లేక 1 ట్రిలియన్ ఉషన్ - పదిలక్షల కోట్లు లేక 10 ట్రిలియన్.

ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే కిరణాలను కొలిచే మాపకము కూడ మన పూర్వాచార్యులకు ఉండి ఉండాలి. ఆ పరాశక్తియొక్క కాంతి ఊషః కిరణాలతో సమానం అంటే 10 ట్రిలియన్ కిరణాలుగల సూర్యులను పోలి ఉందని భావం.

ఇన్ని కిరణాలతో కాంతిమంతమైన ఆ దుర్గాశక్తి 9 విధాలుగా ఉంది. అదే నవదుర్గా స్వరూపాలు.

ఆ నవ దుర్గల పేర్లలో కూడ ఖగోళ శక్తి పరావర్తన గురుత్వాకర్షణ సిద్ధాంతాలు ఇమిడి ఉన్నాయి.

అంతటి శక్తిని కాంతిని సామాన్యంగా మనుష్యులు చూడలేరు పొందలేరు తట్టుకోలేరు భరించలేరు కాబట్టి ఆ మహాశక్తిని దుర్గా అన్నారు. ఆశక్తిని స్త్రీరూపంలో భావిస్తే అవిడే శక్తిదుర్గి.

ఆ శక్తి మిరుమిట్లు గొలిపే వేగంతో మనను రక్షించుగాక అనే ప్రార్థన ఈ మంత్రంలోనూ చరణంలోనూ ఉన్నది.

23 ఈ దుర్గాశక్తి తొమ్మిది పేర్లు - శైలపుత్రీ బ్రహ్మచారిణి చంద్రఘంటామ్ కూష్మాండా స్కందమాతా కాత్యాయనీ కాళరాత్రి మహాగౌరీ సిద్ధిదాత్రి అని. ఇవి సాక్షాత్తుగా సృష్టికర్త బ్రహ్మదేవుడు తెలిపిన పేర్లు.

4 ఇటువంటి పేర్లతో శక్తి క్షేత్రాలతో బ్రహ్మాండమంతా వ్యాపించిన ఆ మహాశక్తి సచ్చిదానందములో నన్ను ముంచెత్తుగాక!

నన్ను పుత్రవాత్సల్యంతో చూడవమ్మా జయాన్ని సంపదను ఇచ్చే జయలక్ష్మి తల్లీ! నీకు నమస్కారం.

సర్వస్వరూపే సర్వేశే సర్వశక్తిసమన్వితే।

భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గే దేవి నమోస్తుతే॥